విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :152 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 19 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## ప్రజల దృష్టి మళ్లించేందుకే రాష్ట్రపతి పాలన డిమాండ్

వైసీపీనే క్షేత్రస్థాయిలో గొడవలు సృష్టిస్తోందని పల్లా ఆరోపణ

జగన్‌పై ఉన్న కేసులను గుర్తు చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం



**అమరావతి**

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్, ప్రజల దృష్టిని మళ్లించేందుకు పన్నిన రాజకీయ ఎత్తుగడ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఒకవైపు క్షేత్రస్థాయిలో ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టిస్తూ, మరోవైపు శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మండిపడ్డారు. జగన్‌రెడ్డితో పాటు వైసీపీ నేతలపై ఉన్న క్రిమినల్ కేసుల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ డ్రామా - మిగతా 3లో



## ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారికి శిక్ష తప్పదు

- ఓటు చోరీకి మోదీ ప్లాన్.. అమిత్ షా అమలు
- సీఈసీ ద్వారా కార్యరూపం
- గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి
- ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదు

### ఎన్నికల ప్రవర్తనా నియమావళి..

# ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

- ప్రవర్తనా నియమావళిని రూపొందించిన ఎన్నికల సంఘం
- కచ్చితంగా పాటించాల్సిందే
- ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని రూపొందించింది
- అభ్యర్థులు, అతని అనుచరులు, రాజకీయ పార్టీల నాయకులు ఈ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాల్సిందే.



**అమరావతి**

స్థానిక సంస్థల ఎన్నికల పోరు మొదలైంది. నగరపాలక సంస్థ ఎన్నికలకు అభ్యర్థులు నామినేషన్లు వేసి ప్రచారానికి సిద్ధమయ్యారు. అయితే ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని రూపొందించింది. అభ్యర్థులు, అతని అనుచరులు, రాజకీయ పార్టీల నాయకులు ఈ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాల్సిందేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇది అమలులో ఉంటుంది. అభ్యర్థులు కులాలు, మతాలు లేదా భాషల మధ్య విభేదాలు సృష్టించకూడదు. అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనకూడదు. జాతి, మతం, కులం, ప్రాంతం ప్రాతిపదికగా ఓటు వేయమని అడగరాదు. ఆలయాలు, మసీదు, - మిగతా 3లో



## సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్

- భద్రతా నిబంధనలు పాటించాలంటూ ఆదేశం
- హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో సౌదీలోని భారతీయ కార్యాలయం అడ్వైజరీని జారీ
- అత్యవసర హెచ్చరికలు వస్తే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

### గవర్నర్‌ను కలిసిన జగన్

- స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార పక్షం అక్రమాలకు పాల్పడుతోందని ఫిర్యాదు
- ఎన్నికల ప్రక్రియకు కేంద్ర బలగాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- ఓటమి భయంతోనే చంద్రబాబు దాడులు చేయిస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టీకరణ



**అమరావతి**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని - మిగతా 3లో

# ముగిసిన గడువు



- పలుచోట్ల నామినేషన్లు వేయని వైఎస్సార్సీపీ అభ్యర్థులు
- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పరిసమాప్తమైంది
- మూడు రోజుల పాటు సాగిన ఈ ప్రక్రియలో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీగా నామపత్రాలు సమర్పణ
- కొన్నిచోట్ల వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేదు

**అమరావతి**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పరిసమాప్తమైంది. మూడు రోజుల పాటు సాగిన ఈ ప్రక్రియలో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీగా నామపత్రాలు సమర్పించారు. కొన్నిచోట్ల వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేదు. మరికొన్ని చోట్ల ఆలస్యంగా వెళ్లడంతో నామపత్రాలను అధికారులు తిరస్కరించారు. అలానే మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పలు చోట్ల వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు అవ్వలేదు. పల్నాడు జిల్లా గురజాలలో వైఎస్సార్సీపీ అభ్యర్థులు ఒక్క నామినేషన్ కూడా సమర్పించలేదు. అటు నిర్దేశిత గడువులోగా నామినేషన్ సమర్పించలేని కారణంగా పిడుగురాళ్ల మున్సిపాలిటీ ఛైర్మన్ పదవికి పోటీ చేసే అవకాశాన్ని వైఎస్సార్సీపీ అభ్యర్థి షేక్ అబ్దుల్లా కోల్పోయారు. 20 నిమిషాలు ఆలస్యంగా - మిగతా 3లో



## సీఈసీని ఎవరూ కాపాడలేరు

- వెంటనే సర్‌ను నిలిపివేయాలి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే
- ఎన్నికల సంఘం వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్



## మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?

- రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం
- సుప్రీం కోర్టు సీరియస్
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించిన చారిత్రాత్మక తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నిర్లక్ష్యంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం

## ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

- నీటి వృథాను అరికడితేనే సంక్షోభానికి కళ్లెం!
- ఎల్‌నినో పరిస్థితుల్లో రానున్న రోజుల్లో నీటి కొరత తలెత్తే అవకాశం ఉంది
- ఈ నేపథ్యంలో నిపుణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు



# సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్



సౌదీ అరేబియాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు జారీ చేసింది. సౌదీ ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని భారతీయులకు సూచించింది. ప్రమాదం తొలగిపోయేవరకు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కిటికీలు, అద్దాలు, బాల్కనీలకు దూరంగా సురక్షితమైన గదుల్లోనే ఉండాలని పేర్కొంది. మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్సుల్లో అత్యవసర సహాయం కోసం '911' నంబర్‌కు, మిగతా ప్రాంతాల వారు '998' నంబర్‌కు కాల్ చేయాలని భారత ఎంబసీ సూచించింది. ముఖ్యంగా దాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని భారత ఎంబసీ హెచ్చరించింది.

సౌదీ అధికారులు అత్యవసర హెచ్చరికల కోసం జాతీయ ముందస్తు హెచ్చరిక వేదిక ద్వారా జారీ చేస్తున్న తాజా మార్గదర్శకాలను గమనించాలని, వాటిని తప్పనిసరిగా పాటించాలని ఆదివారం సూచించింది. అత్యవసర హెచ్చరికలు అందినప్పుడు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలని సౌదీ అధికారులు సూచించారు. ప్రమాదం తొలగిపోయే వరకు భవనంలోని సురక్షిత ప్రాంతానికి వెంటనే వెళ్లాలని, వీలైతే కిటికీలకు దూరంగా ఉన్న లోపలి గదిలో ఉండాలని తెలిపారు. ప్రమాదం ముగిసే వరకు ఇళ్లను లేదా భవనాలను విడిచి బయటకు రావద్దని, బహిరంగ ప్రదేశాలు, కిటికీలు, అద్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్కనీలు, భవనాల పైకప్పులపై నిలబడకూడదని స్పష్టం చేశారు.

**బయట ఉంటే ఏం చేయాలి?**

హెచ్చరికలు వచ్చిన సమయంలో బయట ఉన్నవారు సమీపంలోని భవనంలోకి వెళ్లాలని లేదా బలమైన రక్షణ కల్పించే గోడ వంటి నిర్మాణం వెనుక ఆశ్రయం పొందాలని సూచించారు. జనసమూహాలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఘటనలకు సంబంధించిన ఫొటోలు తీయడం మానుకోవాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో అత్యవసర హెచ్చరిక అందితే వంతెనలు, ఎత్తైన భవనాలకు దూరంగా రహదారి పక్కన వాహనాన్ని నిలిపివేయాలని సూచించారు. అధికారుల నుంచి తదుపరి సమాచారం వచ్చే వరకు వారి సూచనలను పాటించాలని తెలిపారు.

**అత్యవసర నంబర్లు ఇవే**

ప్రమాదం లేదా ముప్పు ఎదురైనప్పుడు సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్స్ ప్రాంతాల్లో 911 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మిగతా ప్రాంతాల్లో అత్యవసర సహాయం కోసం 998 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారా వెలువడే ప్రకటనలు, సూచనలను మాత్రమే అనుసరించాలని భారత రాయబార కార్యాలయం భారతీయులకు విజ్ఞప్తి చేసింది.

**రియాద్ విమానాశ్రయంపై దాడితో ఆందోళనలు**

యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తున్న నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన ప్రాణాంతక దాడిలో ఓ భారతీయుడు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనతో భారత రాయబార కార్యాలయం మరోసారి భద్రతా సూచనలు జారీ చేసింది.

**హూతీలకు సౌదీ హెచ్చరిక**

మరోవైపు తమ విమానాశ్రయాలతోపాటు ఓడరేవులు, చమురుకేంద్రాలు, పౌర సదుపాయాలపై తక్షణమే దాడులు నిలిపివేయాలని హూతీ రెబల్స్‌కు సౌదీ హెచ్చరిక చేసింది. రియాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మల్కీ ఈ మేరకు హెచ్చరిక చేశారు. అభా, నజ్రాన్, జాజాన్ విమానాశ్రయాలపై హూతీలు చేసిన దాడుల వీడియోలను మీడియా ముందు ప్రదర్శించారు. సౌదీలోని విమానాశ్రయాలపై జరిగిన వరుస దాడుల్లో 19మంది ప్రాణాలు కోల్పోగా, 364మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. యెమెన్ పౌరులకు హాని జరగకుండా హూతీల సైనిక స్థావరాలనే తమ బలగాలు దాడులు చేస్తున్నట్లు సౌదీ కూటమి మేజర్ జనరల్ తెలిపారు.

# ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారికి శిక్ష తప్పదు

ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జజుజ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. "ఓటు చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావులేదు. మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, అమిత్ షా వాటిని నిర్వహిస్తున్నారు. సీఈసీ అమలు చేస్తున్నారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. నాపై 45కు పైగా పరువునష్టం కేసులు ఉన్నాయి. వాటిలో మోదీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసిన కేసులే ఉన్నాయి. అయితే, ప్రధానమంత్రి ఓటు చోరీకి పాల్పడ్డారని నా ఆరోపణపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే భయంతోనే వెనుకడుగు వేస్తున్నారు. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్?, అసోంలలో ఓటు చోరీ జరిగిందని



ఆధారాలతో సహా నిరూపించాం. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు చేర్చారు. ఓటర్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకురావడం వంటి అక్రమాలు జరిగాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది"

**'అదానీ, అంబానీలకు ప్రయోజనాలు'**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని రాహుల్ ఆరోపించారు. గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలకు మేలు చేకూర్చేలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భూములు, ఇతర ఆర్థిక అవకాశాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రతిఫలంగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి ప్రచారం కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొందరు బిలియనీర్లకు డబ్బు, కాంట్రాక్టులు, భూములు అందిస్తూ, వారి ద్వారా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

**'గోవాలో భూములు లాక్కుంటున్నారు'**

గోవాలో రైతులు, పేదలకు చెందిన భూములను ప్రభుత్వం లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు కట్టబెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగ కల్పన వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ నమూనా గురించి మాట్లాడేవారని, ఇప్పుడు గోవాలో అవినీతి నమూనా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు

**'యువతను వెలివేసే వ్యవస్థ'**

దేశంలోని విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. డబ్బు అధికారం లేనివారిని, ఆంగ్లంలో మాట్లాడలేని వారిని ప్రస్తుత వ్యవస్థ పక్కన పెడుతోందని విద్యార్థులతో తన సంభాషణకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. లక్షలాది మంది భారతీయ యువతకు విద్యా అవకాశాలు దక్కకుండా చేసే విధానాన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమని వ్యాఖ్యానించారు.

# మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?

రుతుక్రమ ఆరోగ్యాన్ని (బహిష్టు పరిశుభ్రత) ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇప్పటివరకు అవసరమైన వివరాలు అందించకపోవడంపై ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి కూడా స్పందించకపోతే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారించింది. బహిష్టు ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కు తీర్పు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యం కూడా ఈ హక్కులో భాగమని సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రకటించిందని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో తీర్పులో ప్రస్తావించిన లోపాల్ని పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాల్ని తదుపరి విచారణకు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు బెంచ్ గుర్తుచేసింది. అయినా కేంద్రం కోరిన సమాచారం ఇవ్వకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు తీర్పులో చెప్పిన అంశాలు కేవలం కాగితాలపైనే ఉంటే, ఈ ప్రాథమిక హక్కును కేంద్రం, రాష్ట్రాలు ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించింది.



**తీర్పు ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి- డిసెంబర్ 14 డెడ్‌లైన్**

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి- ఈ అంశాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని, తీర్పు అమలు తీరుపై వివరాలు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు స్పందన రాలేదని ఆమె కోర్టుకు వివరించారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం- కేంద్రం కోరినా రాష్ట్రాలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తీర్పు ప్రాముఖ్యతను గుర్తించాయని భావిస్తున్నట్లు తెలిపిన ధర్మాసనం- ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలకు లిఖితపూర్వక వివరాలు సేకరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలోనూ కొన్ని రాష్ట్రాలైనా స్పందించలేదని కేంద్రం చెబితే, సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. చివరిసారిగా అవకాశం ఇస్తూ కేసు విచారణను డిసెంబర్ 14 కు వాయిదా వేసింది. 'మేం తీర్పులో చెప్పిన విషయాలు కేవలం కాగితాలకే పరిమితమైతే, కేంద్రం, రాష్ట్రాలు ఈ ప్రాథమిక హక్కును చిన్నారి బాలికలకు ఎలా అందిస్తాయి? సుదూర ప్రాంతాల్లో రుతుస్రావ పరిశుభ్రత సదుపాయాలు లేక చదువుకు దూరమవుతున్న వేలాది మంది బాలికల సంక్షేమం కోసం ఈ తీర్పు ఇచ్చామని గుర్తించాలి.' అని సుప్రీంకోర్టు తెలిపింది.

**పాఠశాలల్లో బాలికల సమస్యలపై దృష్టి**

రుతుక్రమ పరిశుభ్రత సమస్యల కారణంగా, సరైన సదుపాయాలు లేనందున ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని బాలికలు చదువును మధ్యలోనే మానేస్తున్నారని సుప్రీం కోర్టు పేర్కొంది. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటమే తీర్పు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉండే మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయనే దానితో పాటు, అవి సరిగా ఉన్నాయా లేదా అనే అంశంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. ఇంకా మరుగుదొడ్లకు నీటి సౌకర్యం సరిగా ఉందా లేదా, బాలికలకు ప్రైవసీ, సులభంగా అక్కడికి చేరుకునే సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో బాలబాలికలకు విడివిడిగా నీటి సదుపాయం కలిగిన 30458 మరుగుదొడ్లను ఇప్పటికే నిర్మించామని కేంద్ర ప్రభుత్వం గతంలోనే అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేసింది. ఇంకా 4236 మరుగుదొడ్ల నిర్మాణం తుది దశలో ఉందని పేర్కొంది. ఇక అంతకుముందు ఈ ఏడాది జనవరి 30న కీలక తీర్పులో కూడా సుప్రీం కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింట్లోనూ నీటి సౌకర్యంతో కూడిన, వేర్వేరు మరుగుదొడ్లు ఉండాలని స్పష్టం చేసింది. అలానే ప్రతి పాఠశాలలో బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వీటి అమలు తీరుపైనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వివరాలు కోరింది.

## సీఈసీని ఎవరూ కాపాడలేరు

రాజకీయ పార్టీలకు డిజిటల్, ప్రింట్ రూపాల్లో చదవగలిగే (రీడబుల్), శోధించగలిగే (సర్చబుల్) రూపాల్లో ఓటర్ల జాబితాలను అందించాలని ఎన్నికల సంఘం నిర్ణయించడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఓట్ల దొంగలకు వ్యతిరేకంగా దేశమంతా రోడ్లపైకి వచ్చి పోరాడినదానికి ఫలితంగానే ఈ విజయం దక్కిందని కాంగ్రెస్ ఆదివారం వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవి నుంచి తప్పుకోవాలని, ఇంకా వివాదాస్పద ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలన్న తమ డిమాండ్లను పార్టీ మరోసారి గట్టిగా వినిపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ- ఎన్నికల సంఘాన్ని ఓటర్ల జాబితాలను సెర్చ్ చేయగలిగే రూపంలో అన్ని రాజకీయ పార్టీలకు అందించాలని నిరంతరం కోరుతున్నారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. 2018లో మధ్యప్రదేశ్‌లో లక్షలాది బోగస్ ఓటర్లను కాంగ్రెస్ గుర్తించిన తర్వాత ఎన్నికల సంఘం సెర్చ్ చేయగలిగే ఓటర్ల జాబితాలను అందించడం పూర్తిగా నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. అప్పటి నుంచి 8 ఏళ్ల పాటు తాము డిమాండ్లు చేస్తున్నా, వాటిని పట్టించుకోవడం లేదని, దీని వల్లనే ఓట్ చోరీకి అవకాశం ఏర్పడిందని విమర్శించారు.

**ఓటర్ల జాబితాలపై ఈసీ కీలక నిర్ణయం**

2026, అక్టోబర్ 15న ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసిందని జైరాం రమేశ్ తెలిపారు. రెండేళ్ల విరామం తర్వాత 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తిరిగి ప్రారంభమైన ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలకు సెర్చ్ చేయగలిగే రూపంలో ఓటర్ల జాబితాలను అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు తెలియజేస్తున్న నేపథ్యంలోనే ఈసీ నుంచి ఈ ప్రకటన వచ్చిందని వ్యాఖ్యానించారు. ప్రతిసారీ ఓట్ల చోరీ ఆరోపణలు బయటపడినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక కొత్త విధానాలను అనుసరిస్తోందని జైరాం రమేశ్ విమర్శించారు. చదవగలిగే ఓటర్ల జాబితాలను నిలిపివేయడం, నకిలీ ఓటర్లను చేర్చడం, సర్ ప్రక్రియ వంటివి ఈ కోవలోకే వస్తాయని స్పష్టం చేశారు. ఈసారి మాత్రం అలా కుదరదని హెచ్చరించారు.

**రిస్క్‌లో 13 కోట్లకుపైగా ఓట్లు- సీఈసీ తప్పుకోవాల్సిందే**

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సూచనల మేరకు నడుచుకుంటూ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశారని జైరాం రమేశ్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ తన పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామాతోనే సమస్య పరిష్కారం కాదని, ఎన్నికల సంఘం వ్యవస్థను, దాని ఐటీ వ్యవస్థను కూడా సమూలంగా పునర్వ్యవస్థీకరించాలనేదే కాంగ్రెస్ డిమాండ్ అని వెల్లడించారు. సర్ ప్రక్రియ వల్ల సుమారు 13 కోట్ల మందికిపైగా భారతీయుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని రమేశ్ పేర్కొన్నారు. అందుకే ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాల్సిందిగా కోరారు.

**17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఎస్ఆర్**

మరోవైపు ఎన్నికల సంఘం ఇటీవల 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రతి ఏటా నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (రూా=) చేపట్టాలని నిర్ణయించింది. ఎస్ఐఆర్‌తో దీనికి సంబంధం లేదు. వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఓటరు జాబితా మార్పు చేర్పులు చేసి తుది జాబితాను జనవరి 4న ప్రచురించనున్నారు. ఎస్ఎస్ఆర్ అనేది ఎన్నికల సంఘం ఏటా నిర్వహించే సాధారణ ప్రక్రియ అని ఒక సీనియర్ అధికారి వివరించారు. ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో దీనిని చేపడతారని తెలిపారు. ఈ 17 రాష్ట్రాలు, యూటీల్లో సర్ ప్రకియ ఇప్పటికే పూర్తయిందని చెప్పుకొచ్చారు. ఈ ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో భాగంగానే తొలిసారిగా రాజకీయ పార్టీలకు డ్రాఫ్ట్, తుది ఓటర్ల జాబితాలను చదవగలిగే రూపంలో హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీల రూపంలో అందించనుంది ఈసీ. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అభ్యర్థులకు కూడా ఈ జాబితాల్ని అందించాలని నిర్ణయించింది.

## భారత్‌లో 11 లక్షలకుపైగా ఉపాధ్యాయులు కొరత

ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల కొరత ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 నాటికి పిల్లలందరికీ ప్రాథమిక, మాధ్యమిక విద్యను అందించడం, తక్కువ ఖర్చులో ఉన్నత విద్యను కల్పించడం, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించాలి. అయితే యునెస్కో ఇటీవల విడుదల చేసిన 'గ్లోబల్ రిపోర్ట్ ఆన్ టీచర్స్' నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఈ విద్యావ్యవస్థను కుదిపేస్తోంది. ప్రీ ప్రైమరీ నుంచి సెకండరీ స్థాయి వరకు ప్రతి చిన్నారికి మెరుగైన విద్య అందించాలంటే 2030 నాటికి మరో 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం అని నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 10.7 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ప్రతి ఇద్దరు ఉపాధ్యాయులకు అదనంగా మరో ఉపాధ్యాయుడు అవసరమయ్యే పరిస్థితి ఉందని నివేదిక పేర్కొంది.

**ఉపాధ్యాయుల నియామకానికి ఏటా రూ.10.14 లక్షల కోట్లు**

ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి కొత్త నియామకాలు చేపట్టడం, ఖాళీలను భర్తీ చేయడం, వేతనాలు చెల్లించడం వంటి వాటికి భారీగా నిధులు అవసరం అవుతాయని యునెస్కో నివేదిక తెలిపింది. 2030 నాటికి విద్య లక్ష్యాల్ని చేరుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు రూ. 10.14 లక్షల కోట్ల నిధులు అవసరం అని అంచనా వేసింది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రస్తుతం ఆ వృత్తిలో ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. దీని వల్ల విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తగ్గడం, బోధనలో నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పేద దేశాలు, ముఖ్యంగా సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని యునెస్కో నివేదిక వెల్లడించింది. నైజీరియా, ఘనా, కాంగో రిపబ్లిక్, కామెరూన్, కెన్యా, జింబాబ్వే, మొజాంబిక్, జాంబియా వంటి దేశాలతో కూడిన సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో ప్రాథమిక విద్యకు 2030 నాటికి అత్యధికంగా 43.91 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరం అవుతారని అంచనా వేసింది. ఇంకా మయన్మార్, ఇండోనేసియా, మలేసియా వంటి దేశాలు ఉన్న ఆగ్నేయాసియా ప్రాంతంలో మరో 30.50 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరమని పేర్కొంది.

**సెకండరీ ఎడ్యుకేషన్‌కు 3.11 కోట్ల మంది కొత్త టీచర్లు**

9, 10 తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి సుమారు 3.11 కోట్ల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరమవుతారని నివేదిక తెలిపింది. ఈ సెకండరీ విద్యకు సంబంధించి సబ్ సహారా ఆఫ్రికా దేశాలకు 1.06 కోట్ల మందికిపైగా ఉపాధ్యాయులు అవసరం. భారత్‌తో పాటు ఇతర దేశాలు ఉన్న దక్షిణాసియాకు 67.16 లక్షల మంది, మధ్య ఆసియాకు 6.51 లక్షల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరం అని అంచనా వేసింది. కొత్తగా నియమించాల్సిన ఉపాధ్యాయుల్లో 58 శాతం మంది ఇప్పటికే వృత్తిలో ఉన్న వారు ఉద్యోగాలు వదిలి వెళ్లడం వల్ల ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకే అవసరం అవుతాయని యునెస్కో తెలిపింది. తక్కువ వేతనాలు, అధిక పనిభారం, వృత్తిపరంగా తగినంత గౌరవం లేకపోవడం వంటి అంశాలు ఉపాధ్యాయులు ఉద్యోగాలు వదిలివెళ్లడానికి కారణాలుగా నివేదిక ప్రస్తావించింది. 2024లో ఒక సర్వే ప్రకారం ప్రపంచంలోని 75 శాతం దేశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 40 శాతం కంటే తక్కువ మంది మాత్రమే తమ వృత్తికి సమాజంలో గౌరవం ఉందని భావిస్తున్నారు. వృత్తికి గౌరవం లభిస్తున్నప్పుడు ఉపాధ్యాయులు వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాన్ని వదిలే అవకాశం 10 శాతానికిపైగా తగ్గుతుందని నివేదిక పేర్కొంది. వివిధ దేశాల్లో ఉపాధ్యాయులకు అందుతున్న నెలవారీ వేతనాల్ని కూడా యునెస్కో రిపోర్ట్ పోల్చింది. 2015 డాలర్ విలువ ఆధారంగా, 2023 గణాంకాల ప్రకారం ఖతార్‌లో ఉపాధ్యాయులకు నెల జీతం సుమారు రూ. 97,164 గా ఉంది. నేపాల్‌లో ఇది రూ. 26321 గా ఉంది. భారత్‌కు సంబంధించి 2019 డేటా ప్రకారం ఉపాధ్యాయుల సగటు నెల వేతనం రూ. 25,232 గా ఉంది. ఇక్కడ కూడా 40 శాతం దేశాల్లో ఉపాధ్యాయులకు వారి అర్హతలకు తగిన వేతనాలు అందట్లేదని నివేదిక గుర్తించింది.

**భారత్‌లో 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత**

భారత్‌లోని స్కూళ్లలో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత ఉందని యునెస్కో గత నివేదిక తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని తెలిపింది. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు వివరించింది.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

-మొదటిపేజీ తరువాయి

తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. “ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం” అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన



పిలుపునిచ్చారు.

**ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. “గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం” అని ఆయన పేర్కొన్నారు. “పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది” అని జగన్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార టీడీపీ కూటమి అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎస్ఈసీని ముఖ్యమంత్రి చంద్రబాబే నియమించారని, ఆయన ఆదేశాల మేరకే ఎస్ఈసీ పనిచేస్తున్నారని జగన్ ఆరోపించారు.

# ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

ఎల్‌నినో తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాల్లోని భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. సాధారణంగా వేసవిలో తలెత్తే నీటి సమస్య ఇప్పుడే ముంచుకొస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న పరిమితమైన నీటి వనరులను అవసరం మేరకు మాత్రమే వాడుకుని, నీటి వృథాను అరికట్టడం ద్వారా మాత్రమే ఈ గడ్డు పరిస్థితి నుంచి బయట పడగలం. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటిని ఇతర అవసరాలకు వాడొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

**ఇతర పనులకు శుద్ధిచేసిన మురుగు జలాలు**

తాగునీటేతర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరం సహా ఇతర ప్రధాన నగరాల్లో అత్యాధునిక విధానాలతో మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. వాహనాలు, ఇంటి పరిసరాల శుభ్రత, గార్డెనింగ్ తదితర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను ఉపయోగించాలి.

**ఇలా చేయకండి!**

ొంతమంది కార్లు, బైక్?లు శుభ్రం చేసేందుకు కుళాయి నుంచి వచ్చే పైపులను వాడుతుంటారు. దీనివల్ల అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల తడివస్త్రంతో కారు శుభ్రం చేసుకోవడం మంచిది. బకెట్‌లో నీటిని వినియోగించి తడిగుడ్డతో శుభ్రంచేస్తే 20 లీటర్లు, అంతకంటే తక్కువ నీటితోనే సరిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. వాహనాలను పైపుతో కడగటం కారణంగా వాటి మూలల్లో నీరు నిలిచిపోయి తుప్పుపట్టే అవకాశం ఉంది. ఫలితంగా వాటి జీవితకాలం కూడా తగ్గిపోతుంది. నేరుగా నీటితో శుభ్రం చేయాల్సివస్తే ప్రెషర్ (పవర్) వాషర్ లేదా వాటర్ స్ప్రే ఉన్న హోస్ పైపును వాడాలి.

**షవర్ స్నానాలు వద్దు**

షవర్‌తో స్నానం చేయడం వల్ల కూడా అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల బక్?ట్?నే ఉపయోగించి స్నానం



చేయడం మంచిది. షవర్‌తో స్నానం చేస్తే 100 లీటర్ల నీరు వృథా అవుతుంది.అదే బకెట్ అయితే కొంచెం నీరు సరిపోతాయి.

స్నానం చేసేందుకు టబ్‌లు వాడటం వల్ల కూడా అధికంగా నీరు వినియోగం అవుతాయి. దీనివల్ల నీరు ఎక్కువగా వృథా అవుతాయి.

నడకబాటలు, ఇంటి ఆవరణను శుభ్రం చేసేందుకు పైపులతో నీళ్లు కొట్టడం కంటే, మగ్?లు వాడి చిలకరించడం మంచిది. కుళాయి నీరు పట్టేటప్పుడు ఇంట్లోని బిందులు, పాత్రల్లో ఉన్న పాత నీరును వృథాగా పారవేయొద్దు. వాటిని మొక్కలకు పోయడం లేదా తాగునీటేతర అవసరాలకు వాడుకోవడం మంచిది. షేవింగ్ చేసుకునేటప్పుడు, బ్రష్, చేతులు శుభ్రపరుచుకునేందుకు ట్యాప్?ను తెరిచి అలానే వదిలేయకుండా మగ్?ను వినియోగించండి. తద్వారా వృథాను ఆపండి.

**నీటి వృథా వద్దు**

కూరగాయలు, పళ్లు కుళాయి కింద శుభ్రం చేయడం కంటే గిన్నెలో నీరు పోసి కడగండి.

మొక్కలకు ఉదయం పూట లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే నీటిని పెట్టడం ఉత్తమం. ఎక్కువ విస్తీర్ణంలో ఉండే మొక్కలకు మల్చింగ్ చేసినట్లయితే తక్కువ నీటి వినియోగం ఉంటుంది. వాషింగ్ మెషిన్లతో దుస్తులు ఉతకడం మేలు. వీటిని ఉపయోగించడం వల్ల నీరు వృథా కాదు. డిష్ వాషర్లు తక్కువ నీటిని వినియోగించుకుంటాయి. చేతితో శుభ్రంచేసినట్లయితే 90 లీటర్లకుపైగా నీరు వినియోగం అయితే, డిష్‌వాషర్ 11 లీటర్ల నీటితో శుభ్రం చేస్తుంది. కొన్నిసార్లు కుళాయిలు, ఫ్లష్ ట్యాంకుల్లో లీకేజీ అవుతుంటాయి. లీకయ్యే కుళాయి ద్వారా రోజుకు సుమారు 100 లీటర్ల వరకు నీరు వృథా అవుతుంది.

# బీజేపీతో వైఎస్సార్‌సీపీ దోస్తీకి శాశ్వత ముగింపేనా?

**విజయవాడ :** కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ జాతీయ రాజకీయాల్లో, సోషల్ మీడియా వేదికల్లో ఊహించని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ యంత్రాంగం, కేంద్ర ఎన్నికల సంఘం తీరును సిజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వేళ.. జగన్ నేరుగా ఆ పార్టీ నేతలకు సానుభూతి తెలపడమే కాకుండా, సిజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, నేత అజింక్య షిండేలు ఆ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ థ్యాంక్స్ చెప్పడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎలక్షన్ సిస్టమ్‌పై జగన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు, పరోక్షంగా మోదీ ప్రభుత్వపు ముందస్తు అరెస్టుల వైఖరిని ఎండగట్టడం ఆయన తాజా రాజకీయ వ్యూహానికి నిదర్శనంగా మారుతోంది.గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, విపక్షాల నిరసన తీరును ప్రస్తావిస్తూ పరిస్థితులు ఇలాగే ఉంటే మేం కూడా కాక్రోచ్‌లం అవుతాం అని జగన్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ స్థాయిలో బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో వీధిపోరాటాలు చేస్తుంటే జగన్ వారికి సంపూర్ణ అండగా నిలుస్తున్నారు. ఈ పరిణామం వైఎస్సార్‌సీపీ కేవలం తాత్కాలిక నిరసనలకు పరిమితం కాకుండా, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన యాంటీ బేస్ ను నిర్మించుకోవడానికి మానసికంగా సిద్ధపడిందనే సంకేతాలను ఇస్తోంది.అయితే ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఢీకొట్టడానికి జగన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు జాతీయ స్థాయిలో బీజేపీతో వైరం



పెట్టుకోకుండా, కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులు, ఢిల్లీ మద్దతు కోసం గతంలో వ్యూహాత్మక మౌనం పాటించేవారు. కానీ ఇప్పుడు నేరుగా మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న, మోదీపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీకి నేరుగా మద్దతు ప్రకటించడం ద్వారా బీజేపీతో జగన్ బంధం ఇక పూర్తిగా తెగిపోయినట్లేనా అనే అనుమానాలు బలపడుతున్నాయి. బీజేపీ విషయంలో పరోక్షంగా సైలెంట్‌గా ఉంటూనే, బీజేపీని తీవ్రంగా ఎండగట్టే తీవ్రవాద నిరసన గ్రూపులకు మద్దతివ్వడం వల్ల వైఎస్సార్‌సీపీ నైతికతపై సొంత పార్టీ శ్రేణుల్లోనే అనిశ్చితి నెలకొంటోంది.ఈ వైఖరి వైఎస్సార్‌సీపీ రాజకీయ విశ్వసనీయతను ప్రశ్నించేలా చేస్తోందని భావిస్తున్నారు. అధికారం కోల్పోయిన తర్వాత ఓటు చోరీ, ఈవీఎంలు, కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాతం అంటూ జగన్ వరుసగా గొంతు విప్పుతున్నారు. కానీ, ఏపీలో 2019లో వైఎస్సార్‌సీపీ 151 సీట్లు గెలిచినప్పుడు లేని లోపాలు, 2024లో ఓడిపోగానే ఎన్నికల వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయంటూ జగన్ మాట్లాడటాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుపడుతోంది. ఏపీ బీజేపీ నేతలు సైతం జగన్ వ్యాఖ్యలపై నిప్పులు చెరుగుతూ.. ఓడిపోతే వ్యవస్థ తప్పు, గెలిస్తే వ్యవస్థ ఒప్పా?” అంటూ ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై భిన్నమైన రాజకీయ చర్చ నడుస్తోంది. గతంలో కాక్రోచ్ జనతా పార్టీ నేత సౌరవ్ దాస్ స్వయంగా జగన్ కుటుంబానికి చెందిన భారతి సిమెంట్స్ , ఈడీ కేసులపై సంచలన ట్వీట్లు చేసిన అంశాలను నెటిజన్లు రీ-పోస్ట్ చేస్తున్నారు. గతంలో మిమ్మల్ని విమర్శించిన వారికే నేడు మద్దతు ఇస్తున్నారా? అంటూ నెటిజన్లు జగన్ ట్వీట్‌ను ప్రశ్నిస్తుంటే, మరొకవైపు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మాత్రం ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడే ఎవరికైనా తమ నాయకుడు అండగా నిలుస్తాడని రీ-ట్వీట్లు చేస్తున్నారు.కాక్రోచ్ జనతా పార్టీకి బహిరంగ మద్దతు ఇవ్వడం ద్వారా జగన్ మోహన్ రెడ్డి ఒక పెద్ద పొలిటికల్ గ్యాంబుల్ ఆడారని చెప్పవచ్చు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఉన్న సత్సంబంధాలను వదులుకుని, నేరుగా ఢిల్లీ స్థాయిలో విపక్షాల వైపు నిలబడే సంకేతాలు ఇవ్వడం వల్ల రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లోనే కాక, జగన్‌పై ఉన్న వివిధ కేంద్ర దర్యాప్తు కేసుల్లోనూ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉంది. మరి జగన్ ఇకపై నేరుగా బీజేపీతోనే ఢీకొట్టేందుకు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతారో లేక వ్యూహాత్మక వెనకడుగు వేస్తారో వేచి చూడాల్సిందే.

## ముగిసిన గడువు

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయానికి వచ్చిన ఆయన నామినేషన్‌ను అధికారులు స్వీకరించలేదు. దీంతో వైఎస్సార్స్?పీ అభ్యర్థి నామనేషన్ వేయకుండానే వెనుదిరిగారు.

**25 మంది కౌన్సిలర్ అభ్యర్థులు**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలిరోజే ఘర్షణలు, హింసాత్మక ఘటనలతో అట్టుడికి అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిల్లో వైఎస్సార్సీపీ తరఫున ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. పుంగనూరులో కూటమి, సీపీఐ, ఎస్?పీఐ నేతలు నామినేషన్లు సమర్పించారు. రాయచోటిలో మున్సిపల్ ఛైర్మన్ స్థానానికి, వార్డు కౌన్సిలర్ పదవులకూ వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేదు. అటు ప్రకాశం జిల్లా దర్శిలోనూ వైఎస్సార్సీపీ తరఫున అభ్యర్థులెవరూ నామినేషన్లు వేయలేదు. సమయం మించిపోవడంతో వైఎస్సార్సీపీ ఛైర్మన్ అభ్యర్థి సహా 25 మంది కౌన్సిలర్ అభ్యర్థులు నామపత్రాలు సమర్పించకుండానే వెనుదిరిగారు. కడప మేయర్ స్థానానికీ అంతంత మాత్రంగానే నామినేషన్లు దాఖలయ్యాయి. కొన్ని డివిజన్లలో కేవలం తెలుగుదేశం అభ్యర్థులే నామినేషన్లు వేశారు. మెజారిటీ డివిజన్లలో పోటీ లేకపోవడంతో కడప కార్పొరేషన్ హస్తగతమైనట్లేనని కూటమి అభ్యర్థులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలారు. “సాయంత్రం 3 గంటలకు నామినేషన్లు క్లోజ్ చేశాం. వేరే వాళ్లు 20 నిమిషాలు ఆలస్యంగా కార్యాలయానికి రావడంతో వారి నామినేషన్లు స్వీకరించలేదు. రూల్స్ ప్రకారమే నామినేషన్లు తీసుకోలేదు. దీంతో వారు నామనేషన్ వేయకుండానే వెనుదిరిగారు.”

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి.. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

-మొదటిపేజీ తరువాయి

చర్చిలను ఎన్నికల ప్రచారానికి వేదికలుగా వాడరాదు. అభ్యర్థి ప్రజా జీవితానికి సంబంధం లేని వ్యక్తిగత విషయాలను ప్రస్తావించకూడదు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వ్యక్తిగత ఆరోపణలు చేయకూడదు. అభ్యర్థులకు వ్యతిరేకంగా వారి ఇంటి వద్ద ప్రదర్శనలు, పికెటింగ్‌లు చేయరాదు. ప్రైవేట్ ఆస్తులపై అనుమతి లేకుండా జెండా పెట్టడం, పోస్టర్లు అంటించడం, నినాదాలు రాయరాదు. అనుమతి తీసుకుంటే అందుకు సంబంధించిన కాపీని ఎన్నికల అధికారికి పంపించాలి. ఒక అభ్యర్థి లేదా రాజకీయ పార్టీ కార్యకర్తలు ఎగరేసిన జెండా లేదా అంటించిన పోస్టర్లను ఇతర అభ్యర్థులు, అతని అనుచరులు తొలగించకూడదు. పాడు చేయకూడదు. అవినీతి పద్ధతులు, నేరాలకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు దూరంగా ఉండాలి.

ప్రచురణకర్త పేరు, చిరునామా లేకుండా పోస్టర్లు, కరపత్రాలు, సర్క్యులర్లు, ఇతర పత్రాలు ముద్రించకూడదు. ఇతర పార్టీల, అభ్యర్థుల సమావేశాన్ని అడ్డుకోరాదు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ప్రచారం చేయటం నిషిద్ధం. పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను చేరవేసేందుకు వాహనాలు ఉపయోగించకూడదు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు చేయరాదు. ఊరేగింపులకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే అనుమతి తీసుకున్న లౌడ్‌స్పీకర్లను ఉపయోగించాలి. ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో సభలు, సమావేశాలకు వేర్వేరు పార్టీలు అనుమతి కోరితే ముందు కోరిన వారికే ఇస్తారు.

## ప్రజల దృష్టి మళ్లించేందుకే రాష్ట్రపతి పాలన డిమాండ్

-మొదటిపేజీ తరువాయి

ఆడుతున్నారని పల్లా ఆరోపించారు. అక్రమాస్తుల కేసులో జగన్‌రెడ్డి 16 నెలల పాటు జైలులో ఉన్న విషయాన్ని, వివేకా హత్య కేసులో సీబీఐ ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయడానికి వచ్చినప్పుడు 'గొడ్డలిపార్టీ' వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. తమపై ఉన్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, రాష్ట్రపతి పాలన అంటూ కొత్త నాటకానికి తెరతీయడం రాజకీయ కపటత్వమని దుయ్యబట్టారు. గత ఎన్నికల సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరును ప్రజలు చూశారని, ఇప్పుడు కూడా అదే తరహాలో వివాదాలు సృష్టించి ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ఉద్రిక్తతలు పెంచే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ముందు, గత ఐదేళ్ల తమ పాలనలో వ్యవహరించిన తీరుపై వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్ వేసేలా, ప్రతి ఓటరు భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ రెచ్చగొట్టే ప్రకటనలను నమ్మవద్దని, వాస్తవాలను గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పార్టీలు మారినా రాజకీయ భవితవ్యం..?

**విశాఖపట్నం :** నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం అంతా కాంగ్రెస్ పార్టీలోనే సాగింది. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన తర్వాత ఆయన రాజకీయ జీవితం ఒక్కసారిగా నెమ్మదించింది. పార్టీలు మారినా ఆయనకు ఎలాంటి రాజకీయ టర్నింగ్ పాయింట్ రాలేదునల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం అంతా కాంగ్రెస్ పార్టీలోనే సాగింది. ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన తర్వాత ఆయన రాజకీయ జీవితం ఒక్కసారిగా నెమ్మదించింది. పార్టీలు మారినా ఆయనకు ఎలాంటి రాజకీయ టర్నింగ్ పాయింట్ రాలేదు. జై సమైక్య ఆంధ్ర పేరుతో కొత్త పార్టీ పెట్టినా ప్రయోజనం దక్కలేదు. మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరినా అక్కడ కూడా పెద్దగా గుర్తింపు దక్కలేదు. చివరకు ఆయన కాషాయ కండువా కప్పుకుని బీజేపీలో చేరారు. అయినప్పటికీ ఆయన రాజకీయ భవితవ్యం మాత్రం ఇంకా ఎక్కడా మారలేదు. ఆయనకు అపారమైన రాజకీయ అనుభవంతో పాటు మంచి పాలనాదక్షత ఉంది. బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతగా మంచి పేరుంది. ఎలాంటి వివాదాలు లేని నాయకుడిగా అందరికీ సుపరిచితులు అయ్యారు. అన్ని అర్హతలు ఉన్నా కూడా ఆయనను రాజకీయ సిరి ఇప్పటివరకు పలకరించలేదు.కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను అధికారికంగా ప్రకటించింది. ఆ జాబితాలో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పేరు ఎక్కడా కనిపించలేదు. గవర్నర్లుగా ఎంపికైన వారంతా పూర్తిగా బీజేపీకి చెందిన నాయకులు కావడం ఇక్కడ విశేషం. కిరణ్ కుమార్ రెడ్డి మొదటి నుంచి కాంగ్రెస్ నేపథ్యం ఉన్న నేతగా గుర్తింపు పొందారు. కాషాయ పార్టీలో ఆయనను వలస నాయకుడిగా మాత్రమే చూస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వారికే బీజేపీలో అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందనే వాదన ఉంది. రాజ్ భవన్ పదవులు దక్కాలంటే పార్టీ సిద్ధాంతాలను పూర్తిగా ఒంటబట్టించుకోవాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏపీలో కూడా పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. కేంద్ర పెద్దలు గవర్నర్ల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. కేవలం విధేయత మాత్రమే కాకుండా పార్టీ కోసం చాలాకాలంగా కష్టపడిన వారికే పదవులు దక్కుతున్నాయి. ఈ సమీకరణాల కారణంగానే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి ప్రస్తుతం ఎలాంటి కీలకమైన పదవులు దక్కడం లేదు. ఆయన ఎదురుచూపులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.సరిగ్గా ఈ కారణాల వల్లే కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ ప్రయాణానికి కొంత అడ్డుకట్ట పడుతోంది. ఆయన తండ్రి కాలం నుంచి కుటుంబం మొత్తం కాంగ్రెస్ సిద్ధాంతాలకే కట్టుబడి ఉంది. అదే నేపథ్యం కారణంగా బీజేపీలోకి వచ్చినా సరే పార్టీలో అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయనకు 2024 ఎన్నికలలో రాజంపేట లోక్ సభ స్థానం కేటాయించారు. అది ఆయనకు అత్యంత సొంత ఇలాకా అయినప్పటికీ విజయం సాధించలేకపోయారు. రాష్ట్రంలో కూటమి గాలి వీచినా ఆయన ఓటమి పాలు కావడం గమనార్హం. దాంతో పార్టీ పెద్దలకు ఆయన మీద ఉన్న నమ్మకం కొద్దిగా సడలిపోయింది. ఎవరికి ఏ పదవి ఇస్తే ఎంత లాభం ఉంటుందో పార్టీ అధిష్టానం బేరీజు వేసుకుంటుంది. కేవలం బీజేపీ మాత్రమే కాదు ఏ రాజకీయ పార్టీ అయినా ఇదే సూత్రం పాటిస్తుంది. కేవలం పదవులు ఇవ్వడం వల్ల వచ్చే మైలేజ్ ఎంత అనే లెక్కలు చాలా ముఖ్యం. ఈ రాజకీయ లెక్కల వల్లే కిరణ్ కుమార్ రెడ్డి ఆశించిన స్థాయి గుర్తింపును పొందలేకపోతున్నారు. భవిష్యత్తులో ఆయన ఈ అడ్డంకులను ఎలా దాటుతారనేది చూడాలి.తొలినాళ్లలో కిరణ్ కుమార్ రెడ్డి రాజ్యసభకు వెళ్లాలని తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. పెద్దల సభ ద్వారా నేరుగా కేంద్ర మంత్రి పదవిని దక్కించుకోవాలని

# బెంగళూరు నుంచి తాడేపల్లికి జగన్.. మున్సిపల్ ఎన్నికల వేడి, ఎస్ఈసీతో భేటీ



మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌ల పర్వంలో హింస, ఎన్నికల సంఘం పనితీరుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నామినేషన్ల సందర్భంగా పులివెందుల, పుంగనూరు, రాయచోటి, రాజంపేట వంటి ప్రాంతాల్లో వైసీపీపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన ఆదివారం బెంగళూరు నుంచి తాడేపల్లి వచ్చారు. ముందుగా ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేతాను కలిసి ఎన్నికల అధికారులు, పోలీసుల పనితీరుపై ఫిర్యాదు చేశారు. అనంతరం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గలేక అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా దౌర్జన్యాలకు తెగబడుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వడం లేదని, నామినేషన్ కేంద్రాల వద్దే పత్రాలను చించివేస్తూ, అభ్యర్థులపై భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. పుంగనూరులో పార్టీ లోక్‌సభ పక్షనేత పీవీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నం చేయడం, పులివెందులలో పోలీసులు గాలిలోకి కాల్పులు జరపడం, బాష్పవాయువు ప్రయోగించడం వంటి సంఘటనలు రాష్ట్రంలో ఏ రకమైన 'గూండా రాజ్' నడుస్తోందో నిరూపిస్తున్నాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు గాలికెగిరిపోవడంతో, మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తామనే నమ్మకం లేకనే చంద్రబాబు ఈ విధ్వంసకాండకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఎన్నికల వ్యవస్థల నియామకం పనితీరుపై జగన్ కొన్ని కీలకమైన సంస్కరణలను డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల నియామకం ప్రభుత్వాల ఏకపక్ష నిర్ణయాల ఆధారంగా జరగకూడదని స్పష్టం చేశారు. కేంద్రంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) నియామకం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధాని, విపక్ష నేతలతో కూడిన కమిటీ ద్వారా జరగాలని సూచించారు. అదే రీతిలో రాష్ట్రంలో ఎస్ఈసీ నియామకం కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతల సంయుక్త నిర్ణయంతో జరగాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్ఈసీ, సీఈసీ నియామకాలను ప్రభుత్వం నిర్ణయించే విధానాన్ని తమ ప్రభుత్వం కూడా సమర్థించిందని, అయితే ఆ రోజు తాము చేసిన తప్పుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నామని, విద్యార్థులే ఎగ్జామినర్‌ను ఎన్నుకున్నట్లుగా ఈ విధానం ఉందన్నారు.

ప్రస్తుత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా వైఖరిపై వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు హయాంలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన అనిల్ చంద్ర పునేతా తీరుపై నాడు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి విధుల నుంచి తొలగించిందని గుర్తుచేశారు. పదవీ విరమణ పొందిన అటువంటి వ్యక్తిని చంద్రబాబు మళ్లీ ఏపీ ఎస్ఈసీగా తీసుకొచ్చారని, ఆయన వీరవిధేయుడిగా మారి కూటమి ప్రభుత్వం చెప్పినట్లే నడుచుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే నామినేషన్ కేంద్రాల వద్ద కేంద్ర పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను మారుస్తారనే అనుమానాలు ఉన్నందున స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లలో సీసీ కెమెరాల నిఘా పెట్టాలని మరియు 17జ ఫారమ్‌లలో ఫోర్జరీ సంతకాలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చివరగా, కూటమి ప్రభుత్వం నాటుతున్న ఈ విష విత్తనాలు రాబోయే రోజుల్లో పెద్ద చెట్లు అవుతాయని, అరాచకాలకు కొమ్ముకాస్తున్న అధికారులకు జగన్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రతి అధికారికి సంబంధించిన సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నాయని, తమ ప్రభుత్వం వచ్చాక అన్యాయం చేసిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి శిక్షిస్తామని స్పష్టం చేశారు. అధికారులు చంద్రబాబుకు కాకుండా ప్రజాస్వామ్యానికి, చట్టానికి సెల్యూట్ చేయాలని హితవు పలికారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం 'స్టార్టింగ్ లైన్' మాత్రమేనని, 2029 సాధారణ ఎన్నికలే 'ఫినిషింగ్ లైన్' అని పేర్కొన్న జగన్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పట్టుదలే రాబోయే రోజుల్లో బాబు ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని, పార్టీ ఎప్పుడూ ప్రజల గొంతుకై నిలబడుతుందని భరోసా ఇచ్చారు.

# సీనియర్ Vs సిన్సియర్... ఆసక్తికరంగా విశాఖ మేయర్ రేసు





రాష్ట్రంలోని అతిపెద్ద నగరపాలక సంస్థ విశాఖపట్నంలో మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఈ మేయర్ సీటును ఎందరో హేమాహేమీలు ఆశించగా, టీడీపీ అధిష్టానం అనూహ్యంగా యువ మహిళా నేతను రంగంలోకి దింపి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. మరోవైపు అత్యంత కీలకమైన విశాఖ కార్పొరేషన్ పై పట్టుబిగించే ఉద్దేశంతో విపక్షం వైసీపీ కూడా వ్యూహాత్మకంగా పావులు కదిపింది. ఎవరూ ఊహించని విధంగా విశాఖ నుంచి సీనియర్ నేత వరుదు కల్యాణిని బరిలో దింపింది. ఈ పరిణామంతో విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి ముక్కా శ్రావణి హాట్ ఫేవరెట్ గా పోటీకి దిగినా, ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి వరుదు కల్యాణి సీనియార్టీ, నగరవ్యాప్తంగా ఉన్న పరిచయాలు, వాగ్దాటితో గట్టిపోటీ ఇస్తున్నట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో విశాఖ రేసు ఎలా ఉంటుందనే ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది.

విశాఖ కార్పొరేషన్ లో దాదాపు 18 లక్షల ఓటర్లు ఉన్నారు. 120 డివిజన్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద నగర పాలక సంస్థగా విశాఖ గుర్తింపు తెచ్చుకుంది. ఇక భౌగోళికంగా, ప్రాంతీయంగా రాజకీయంగా ఉన్న ప్రాధాన్యతలు కూడా విశాఖ సీటును హాట్ హాట్ గా మార్చేశాయి. అదేసమయంలో ప్రత్యక్ష విధానంలో ఎన్నిక జరుగుతుండటం కూడా మేయర్ పదవికి క్రేజ్ పెంచింది. ఈ నేపథ్యంలో అధికార, విపక్షాల మధ్య పోటీ ఎలా ఉంటుందనే అంశంపై విస్తృత చర్చలు సాగుతున్నాయి. 1858లో మున్సిపాలిటీగా ఆవిర్భవించిన విశాఖ 1979లో కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ అయింది. 1981లో తొలిసారి మేయర్ ఎన్నిక జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు ఆరు సార్లు ఎన్నికలు జరిగితే ఏడుగురు మేయర్లుగా పనిచేశారు. ఇందులో టీడీపీ ఒకసారి డైరెక్టుగా గెలవగా, తాజా మాజీ మేయర్ పీలా శ్రీనివాసరావు గత పాలకవర్గంపై కార్పొరేటర్ల తిరుగుబాటుతో పదవిని దక్కించుకున్నారు. ఇలా 40 ఏళ్ల విశాఖ కార్పొరేషన్ లో కేవలం రెండు సార్లు మాత్రమే టీడీపీ అధికారం చెలాయించింది.

**బలంగా టీడీపీ**

ఇక ప్రస్తుత కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ బలమైన కేడర్ తో బరిలోకి దిగింది. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 8 మంది ఎమ్మెల్యేలు ఉండగా, అందరూ కూటమి నేతలే కావడం గమనార్హం. ఇక విశాఖ ఎంపీ శ్రీభరత్ టీడీపీకి అదనపు బలంగా చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి విజయంపై ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భౌగోళికంగా, రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ సీటు కోసం పార్టీలో ఎందరో ప్రయత్నించినా, అధిష్టానం మాత్రం యువత, బీసీ కోటాలో డాక్టర్ ముక్కా శ్రావణికి ఎంపిక చేసింది. లోకల్ లీడర్ కావడం, మంచి విద్యార్హతలు, గతంలో కార్పొరేటర్ గా ఎన్నికైన అనుభవం శ్రావణికి కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. ఇక్కడ శ్రావణి గెలుపు వ్యక్తిగతంగా ఆమెకు అవసరమే అయినప్పటికీ, ఆమెను గెలిపించాల్సిన అవసరం ఎక్కువగా టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకే ఉందని అంటున్నారు. దీంతో శ్రావణి కూడా తన విజయం పట్ల ధీమాగా ఉన్నారని అంటున్నారు. మరోవైపు పార్టీకి సంప్రదాయంగా ఉన్న ఓటు బ్యాంకు, తొలి నుంచి పార్టీనే నమ్ముకుని ఉన్న నేపథ్యం శ్రావణికి అదనపు బలంగా చెబుతున్నారు.

**అభ్యర్థే వైసీపీ బలం**

ప్రతికూల రాజకీయ పరిస్థితుల్లో విశాఖ మేయర్ పరీక్ష ఎదుర్కొంటున్న వైసీపీ తన అభ్యర్థి వరుదు కల్యాణిపైనే ఆశలు పెట్టుకుంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న కల్యాణి మంచి వాగ్దాటితో రాజకీయంగా మంచి ఇమేజ్ తెచ్చుకున్నారు. అనుభవం, నగరంలో పరిచయాలు ఆమెకు కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. ఇక నగరంలో పార్టీకి పెద్ద ఎత్తున ఉన్న కేడర్ తో ఆమె ఎన్నికలను ఎదుర్కొనేలా వ్యూహ రచన చేస్తున్నారు. అదేసమయంలో నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీ ఓటర్లపైన కల్యాణి ఆశలు పెట్టుకున్నారు. విశాఖ నగరంలో పెద్ద ఎత్తున వలస ఓటర్లు స్థిరపడటం, తన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా ఓటర్లు ఫలితాన్ని శాసించే స్థితిలో ఉండటం కూడా వైసీపీ అభ్యర్థికి ఉత్సాహం ఇస్తోందని చెబుతున్నారు.

ఇలా రెండు పార్టీల వారు బీసీ మహిళలకు అవకాశం ఇవ్వడంతో మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారిందని అంటున్నారు. రాష్ట్ర ఆర్థిక రాజధానిగా పురోగమిస్తున్న విశాఖలో గెలవడం ద్వారా తమకు తిరుగులేదని సంకేతాలు ఇవ్వాలని కూటమి భావిస్తుండగా, ఎక్కడ కోల్పోయామో అక్కడ నుంచే మళ్లీ మొదలు పెట్టాలనే ఉద్దేశంతో విశాఖ మేయర్ సీటుపై సర్వశక్తులు ఒడ్డి నెగ్గాలని వైసీపీ భావిస్తోంది. గత ప్రభుత్వంలో పరిపాలనా రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామని ప్రచారం చేసిన వైసీపీ ఆ దిశగా తీసుకున్న చర్యలను వివరించేలా ప్రచారం చేయాలని భావిస్తోంది. తమ హయాంలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేశామని, కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో ఏమీ చేయలేదని చెబుతోంది. అయితే వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ విశాఖలో ఇప్పటివరకు టీడీపీనే ఆధిపత్యం ప్రదర్శిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ ఎన్నికల్లో ఎటువంటి ఫలితం వస్తుందనేది ఉత్కంఠ పెంచుతోందని అంటున్నారు.

# విజయవాడలో హైడ్రామా.. తగ్గేదేలే అంటున్న తమ్ముళ్లు.. పోటీకి సై అంటోన్న బీజేపీ




విజయవాడ నగరంలో పొత్తు రాజకీయాలు వేడి పుట్టిస్తున్నాయి. కూటమిలోని మూడు పార్టీలు సీట్ల సర్దుబాటులో బెట్టు చేస్తున్నాయి. శనివారం అర్ధరాత్రికి ఒక అవగాహనకు వచ్చినట్లు చెబుతున్నా, బీజేపీ వైఖరితో రాజకీయం హాట్ హాట్ గానే కొనసాగుతోంది. ఇదే సమయంలో తన నియోజకవర్గంలో ఎక్కువ డివిజన్లు జనసేనకు కేటాయించడాన్ని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంలో ఎంపీ కేశినేని చిన్నపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారని జరుగుతున్న ప్రచారం వాతావరణాన్ని వేడెక్కించింది. దీంతో నామినేషన్ల ఉపసంహకరణ వరకు సీట్ల సర్దుబాటుపై స్పష్టత వచ్చే అవకాశం కనిపించడం లేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.విజయనగరం కార్పొరేషన్ లో మేయరు సీటును జనసేనకు కేటాయించారు. ఇక నగరంలో 86 డివిజన్లను పార్టీల బలాబలాల మేరకు సర్దుబాటు చేసుకోవాలని భావించారు. అయితే తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో తమ పార్టీకే ఎక్కువ సీట్లు కావాలని ఎమ్మెల్యేలు కోరుతుండటంతో పొత్తు చర్చల్లో చిక్కుముడులు పడ్డాయని అంటున్నారు. నగరంలో మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా, తూర్పు, సెంట్రల్ ఎమ్మెల్యేలు టీడీపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పశ్చిమ ఎమ్మెల్యే బీజేపీ. దీంతో తమ పరిధిలో తమ వారే కార్పొరేటర్లుగా పోటీ చేస్తారని సెంట్రల్ ఎమ్మెల్యే ఉమా, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పట్టుబడుతున్నారని అంటున్నారు.

ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా పలుమార్లు సమావేశమైన సమన్వయ కమిటీ సభ్యులు శనివారం అర్ధరాత్రికి ఒక నిర్ణయానికి వచ్చారని ప్రచారం జరుగుతోంది. అయితే ఏ నిర్ణయం తీసుకున్నారనే విషయమై అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడంతో కార్యకర్తల్లో గందరగోళం కనిపిస్తోందని అంటున్నారు. అనధికార సమాచారం ప్రకారం మొత్తం 86 డివిజన్లలో టీడీపీకి 58, జనసేనకు 21, బీజేపీకి 7 కేటాయించినట్లుగా చెబుతున్నారు. అయితే పశ్చిమ నియోజకవర్గంలో 14 డివిజన్లు కావాలంటూ బీజేపీ డిమాండ్ చేస్తుండటంతో సర్దుబాటుపై అనిశ్చితి నెలకుందని అంటున్నారు. ఎవరు ఏమనుకున్నా బీజేపీ తరపున 14 సీట్లలో పోటీ చేస్తామని ఆ పార్టీ నేతలు చేసిన ప్రకటన హై డ్రామాకు తెరలేపిందని చెబుతున్నారు.చర్చలు కొలిక్కి వచ్చినా మిత్రపక్షాలు చేస్తున్న ప్రకటనలతో టీడీపీ నేతలు, అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. ఓ పక్క నామినేషన్లకు చివరి రోజు కావడంతో తమ పరిస్థితి ఏంటి? అంటూ అభ్యర్థులు జుట్టు పీక్కుంటున్నారు. ఎమ్మెల్యేలకు ఫోన్లు చేస్తూ తమ పరిస్థితి తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఒత్తిడికి గురవుతున్న ఎమ్మెల్యేలు పార్టీ అగ్రనాయకత్వంపై అసహనం వ్యక్తం చేస్తూ తమ అనుచరులతో నామినేషన్లు వేయిస్తామని, తర్వాత చూసుకుందామని చెబుతూ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారని అంటున్నారు.

**సొంతంగా బీజేపీ పోటీ**

నగరంలోని 14 డివిజన్లలో పోటీ చేయాలని బీజేపీ నేతలు సొంతంగా నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం కూటమిలో చిచ్చు రేపుతోందని అంటున్నారు. బీజేపీకి 7 సీట్లు ఇవ్వడంపై ఆ పార్టీ కార్యకర్తల్లో అసంతృప్తి నెలకుందని అంటున్నారు. దీంతో కార్యకర్తలను చల్లార్చేందుకు తమకు బలం ఉన్న 14 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని బీజేపీ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తొలి నుంచి తాము 14 స్థానాలు అడుగుతుంటే కూటమి నేతలు ముందుగా 9 స్థానాలు ఇస్తామని చెప్పి, చివరికి 7 స్థానాలతో సర్దుకోవాలని అనడంపై బీజేపీ క్యాడర్ రగిలిపోతోందని అంటున్నారు. దీంతో ఆదివారం 14 డివిజన్లలో ముందు నామినేషన్ వేసి తర్వాత చర్చిద్దామన్నట్లుగా బీజేపీ వైఖరి ఉందని అంటున్నారు. దీంతో విజయవాడ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

# 'మోదీ వర్సెస్ యాంటీ మోదీ' వార్.. లండన్ వీధుల్లో భారత రాజకీయం.. అసలు కథేంటి?

విదేశీ గడ్డపై భారత రాజకీయ పరిణామాలు మరోసారి తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. లండన్ వీధుల్లో ఒకవైపు భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వరం వినిపిస్తుంటే.. మరోవైపు దేశ ప్రతిష్ఠను చాటేలా కౌంటర్ ర్యాలీలు హోరెత్తుతున్నాయి. అసలు ఈ రచ్చ వెనుక ఉన్న రాజకీయ సమీకరణాలేంటి? ఇది ప్రజాస్వామ్య స్వేచ్ఛా ప్రకటనో లేక విదేశీ గడ్డపై పెరుగుతున్న రాజకీయ విభజన పరిణామమా? అన్నది హాట్ టాపిక్ గా మారింది.ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కు వ్యతిరేకంగా కొన్ని విద్యార్థి సంఘాలు, ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ మద్దతుదారులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థల తీరుపై వారు పలు ప్రశ్నలు లేవనెత్తారు. అయితే ఈ నిరసనలకు ప్రతిస్పందనగా 'టీమ్ భారత్' పేరిట మరో ప్రవాస భారతీయుల బృందం రంగంలోకి దిగింది. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని 'భారత్ మాతా కీ జై' నినాదాలతో లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం ఎదుట భారీ ర్యాలీ నిర్వహించింది. విదేశాల్లో దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలను తిప్పికొట్టడమే తమ ప్రధాన ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఇక్కడ ఒకవర్గం ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును వినియోగించుకుంటుంటే.. మరొక వర్గం దేశ ప్రయోజనాలు, ప్రతిష్ఠకు మద్దతుగా తమ స్వరాన్ని వినిపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఏమిటంటే ఒక రాజకీయ నాయకుడిని లేదా ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం అంటే దేశాన్ని వ్యతిరేకించడమేనా అనేదే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం.. ఎన్నికల వ్యవస్థపై సందేహాలను వ్యక్తం చేయడం.. అధికారుల పనితీరుపై విమర్శలు చేయడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలో భాగమే. అదే సమయంలో విమర్శల పేరుతో దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని భావించే వారు తమ అభ్యంతరాలను వ్యక్తం చేయడం కూడా వారి హక్కే అవుతుంది. అందువల్ల భావోద్వేగాలతో ఒకరిపై ఒకరు 'దేశభక్తులు' లేదా 'దేశ వ్యతిరేకులు' అని ముద్రలు వేయడం కంటే.. ఆయా వర్గాలు లేవనెత్తిన అంశాల్లో ఎంతవరకు వాస్తవం ఉందనేది ఆధారాలతో పరిశీలించడమే సరైన ప్రజాస్వామ్య దృక్పథం.ఇక నిరసనల చుట్టూ అల్లుకున్న మరో వివాదం ఏమిటంటే మోదీ, సీఈసీలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ పౌరులు కూడా పాల్గొన్నారని.. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారనే ఆరోపణలు రావడం. అలాగే ఒక నిరసనలో కొందరు వ్యక్తులు చేసిన వివాదాస్పద చర్యలను మొత్తం విద్యార్థి లోకానికి లేదా ఒక దేశ ప్రజలందరికీ ఆపాదించడం కూడా సబబు



కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.డిజిటల్ మీడియా, సోషల్ మీడియా యుగంలో స్వదేశంలో జరిగే ప్రతి చిన్న రాజకీయ పరిణామం విదేశాల్లోని భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యే చిన్న చిన్న వీడియో క్లిప్పులు పూర్తి వాస్తవాన్ని చూపించకపోవచ్చు.. అక్కడ ఎవరి రాజకీయ భావజాలానికి అనుగుణంగా వారు కథనాలను ప్రచారం చేసే అవకాశం ఉంటుంది. పైగా విదేశీ గడ్డపై జరిగే ఇలాంటి నిరసనలు అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించి.. భారత రాజకీయ వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీస్తాయి. ధ్రువ్ రాఠీ వంటి డిజిటల్ క్రియేటర్ల ప్రచారం ఆధారంగా కాకుండా విశ్వసనీయ నివేదికలతో ఎన్నారైలు రియాక్ట్ అయితేనే ఇలాంటివి జరుగకుండా ఉంటాయి.లండన్ వీధుల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలు భారత రాజకీయ ప్రభావం అంతర్జాతీయ స్థాయికి ఏ విధంగా పాకిందో స్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని సమర్థించే హక్కు ఎంత ముఖ్యమో.. విమర్శించే స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం. 'టీమ్ భారత్' ర్యాలీ దేశానికి తమ మద్దతును తెలపగా.. వ్యతిరేక నిరసనకారులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ రెండింటిలో ఏది సరైనదో తేలాల్సింది రాజకీయ నినాదాలతో లేదా భావోద్వేగాలతో కాక వాస్తవాలు, ప్రామాణిక ఆధారాలు.. స్వేచ్ఛాయుతమైన ఆరోగ్యకరమైన చర్చల ద్వారానే.. విదేశాల్లో భారత పరువు ప్రతిష్టలకు సంబంధించిన ఈ విషయంలో భారతీయులు సంయమనం పాటిస్తే దేశ ప్రతిష్ట ఇనుమడిస్తుంది.

# పులివెందుల స్థానిక పోరు.. జగన్‌కు బిగ్ టెస్టే..!



వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియ భారీ ట్విస్టులతో ముడిపడిందనే చెప్పాలి. వైసీపీ తరఫున ఇప్పటికే మహిళ నాయకురాలు, జగన్ బంధువు టికెట్ సంపాదించుకున్నారు. నామినేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక, టీడీపీ కూడా ఈ సీటును మహిళకు ఎంపిక చేశారు. దీంతో వైసిపి- టిడిపి మహిళా నాయకురాళ్ల మధ్య తీవ్రస్థాయిలో పోటీ అయితే ఉండనంది. ఇందులో ప్రధానంగా గమనించాల్సింది పులివెందుల మున్సిపాలిటీని దక్కించుకోవడం జగన్ కి ఇప్పుడు అత్యంత కీలకం.రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పరిస్థితి దారుణంగా ఉన్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంలో మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకోకపోతే అది మరింత ఇబ్బందికర పరిణామాలు సృష్టించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గత ఎన్నికల పరిస్థితులను చూసుకుంటే ఇరుపక్షాల మధ్య కూడా దాడులు జరిగాయి. అలాగే మాటల తూటాలు.. వ్యూహ ప్రతివ్యూహాలు కూడా ఇరు పక్షాల మధ్య కామన్ గా మారిపోయింది. మహిళా నాయకులు పోటీలో ఉన్న నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందా.. లేకపోతే సర్దుబాటు అవుతాయా అనేది చూడాలి.

కానీ అటు వైసిపి ఈ ప్రాంతాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహంతో ముందుకు సాగుతూ ఉండడం గమనార్హం. అలాగే టిడిపి కూడా జగన్ నియోజకవర్గంలో తాము పాగా వేయాలని నిర్ణయించుకున్న క్రమంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తిగా మారింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలన్న వ్యూహాన్ని టిడిపి వైసిపిలు అనుసరిస్తున్నాయి. వైసీపీ తరఫున బరిలోకి దిగిన జగన్ చిన్నమ్మ వైయస్ ప్రమీల టిడిపి అభ్యర్థిగా ప్రకటించిన తుగుట్ల గీతా కుమారి ఇద్దరు సీనియర్ నాయకులు కావడం గమనార్హం.

అంతేకాదు.. ఇరువురికి స్థానికంగా బలమైన ఫాలోయింగ్ ఉండడం వంటివి కీలకంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం టిడిపికి స్థానికంగా మద్దతు ఎక్కువ కనిపిస్తోంది. బీటెక్ రవి వ్యూహాలు అదేవిధంగా టిడిపి అధిష్టానం అనుసరిస్తున్న పద్ధతులు వంటివి ఈ నియోజకవర్గంలో ప్రభావం చూపించే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రమీలమ్మ రంగంలోకి దిగడంతో వైఎస్ ఫ్యామిలీ ప్రభావం కూడా ఉంటుందన్నది పరిశీలకులు అంటున్నారు. మరి ఏం జరుగుతుందని చూడాలి. ఏది ఏమైనా జగన్‌కు ఇది అత్యంత సవాలుగా మారనుందన్నది ఖాయం.

# ఏపీ లోకల్ వార్ ఇంకా ట్విస్టులు ఉన్నాయ్.. వీళ్లకు బిగ్ టెస్ట్... !



స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన శుక్రవారం నాడు రాయలసీమ జిల్లాల్లోని రాజంపేట పార్లమెంటు పరిధిలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల్లో టిడిపి వైసిపి వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలు తారా స్థాయికి చేరాయి. కనీసం నామినేషన్ వేసే పరిస్థితి కూడా లేదన్న వాదన బలంగా వినిపించేలా చేసింది. దీనిపై పోలీసులు సీరియస్ గా స్పందించారు. తాజాగా 70 మందిపై కేసులు పెట్టారు. ఇంకా వందల మంది ఈ దాడుల్లో పాల్గొన్నారని భావిస్తూ.. వారి వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఈ ఘర్షణలు ఇక్కడితో ఆగిపోయినట్టేనా ఇక అంతా ప్రశాంతంగా జరుగుతుందా అంటే దీనికి సమాధానం లేదు. ఎందుకంటే ఇంకా బలమైన, వివాదాస్పదమైన నియోజకవర్గాలు చాలా ఉన్నాయి. వాటిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారుతున్నాయి. నువ్వా నేనా అన్నట్టుగా ఉన్న ఆయా నియోజకవర్గాల్లో మరిన్ని ట్విస్టులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటిలో ప్రధానంగా తాడిపత్రి, ఆళ్లగడ్డ, కర్నూలు, ఒంగోలు, చీరాల, బాపట్ల ఇట్లా అనేకమైన సమస్యాత్మక ప్రాంతాలు కనిపిస్తున్నాయి.

వీటిలో కూడా టిడిపి- వైసిపిల మధ్య చిరకాల ఘర్షణలు చోటు చేసుకుంటాయన్న అంచనాలు ఉన్నాయి. అలాగే మాచర్ల, గురజాల వంటి పల్నాడు ప్రాంతాల్లో సీట్లు కూడా హాట్ హాట్ గా ఉన్నాయి. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని వైసిపి నాయకులను పోలీసులు హౌస్ అరెస్టులు చేయటం ఆంక్షలు విధించడం వంటివి ఉన్నప్పటికీ.. ఏ క్షణంలో ఏం జరుగుతుందని చెప్పడం కష్టంగా మారుతోంది. మరోవైపు టిడిపి నాయకులు కూడా ఏం జరిగినా ఫర్వాలేదు.. అనే రీతిలో నామినేషన్ కేంద్రాలకు వెళ్లే పరిస్థితి నెలకొంది.

దీనికి ప్రధానంగా దీర్ఘకాలంగా ఉన్న విభేదాలు, రాజకీయంగా జరుగుతున్న పరిణామాలు వంటిపై కారణాలని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఒకప్పుడు పరిమితమైన

సమస్యలు ఇప్పుడు దాదాపు సగానికి పైగా నియోజకవర్గాలకు పాకడం ఆయా ప్రాంతాల్లో తీవ్రస్థాయి ఘర్షణలు చోటు చేసుకోవడం వంటివి చర్చనీయాంశంగా ఉన్నాయి. ఇరుపక్షాల్లోనూ పట్టుదల, ఆగ్రహం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చలాయించాలన్న ధోరణే కనిపిస్తోంది తప్ప ఎన్నికలను ప్రశాంతంగా ముందుకు తీసుకు వెళ్లాలన్న ఆలోచన కొరవడింది అన్నది వాస్తవం.

దీనిని పరిష్కరించేందుకు ఇరుపక్షాలు సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి. ముఖ్యంగా పులివెందుల, కుప్పం వంటి నియోజకవర్గాల్లో పరిస్థితులు మరింత దారుణంగా ఉండే అవకాశం ఉందని పోలీసులు ముందుగానే భావిస్తున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియను సవాల్‌గా తీసుకుంటున్నారు. మరి ఏం జరుగుతుందనేది చూడాలి. ప్రస్తుతం అయితే సమస్యాత్మక ప్రాంతాలు పెరుగుతున్నాయి. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఏ మేరకు ఫలిస్తాయి అన్నది ఆందోళన గానే ఉంది.

# నామినేషన్ల చివరి రోజు ట్విస్టు.. మూడు చోట్ల వైసీపీకి షాక్



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. ఆ తర్వాత సమయం మించిపోయిందని పలుచోట్ల అభ్యర్థులను వెనక్కి పంపారు. రాష్ట్రంలో మొత్తం వంద పట్టణ సంస్థలకు నామినేషన్లు స్వీకరించారు. ఇందులో 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. అయితే రాయలసీమతోపాటు ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో ఉద్రిక్త పరిస్థితులతో నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం కలిగింది. మిగిలిన ప్రాంతంలో సజావుగా ముగిసింది. అధికార, విపక్షాల మధ్య ఘర్షణలతో రాయచోటి, దర్శి, పిడుగురాళ్లలో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని చెబుతున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో తొలి ఘట్టం ముగిసింది. ఈ నెల 14న షెడ్యూల్ విడుదల కాగా, 16వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించారు. సోమవారం నామినేషన్లను పరిశీలిస్తారు. 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తారు. 26వ తేదీవరకు అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు గడువు ఉంది. 28న పోలింగ్, 30న ఫలితాలు విడుదల అవుతాయి. మూడు రోజులుగా వంద పట్టణ సంస్థల్లో నామినేషన్లు స్వీకరించగా, రాయలసీమలోని ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి.తొలిరోజు పుంగనూరులో మొదలైన గొడవ పులివెందులలో పతాకస్థాయికి చేరింది. చివరికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సైతం జోక్యం చేసుకోవాల్సివచ్చింది. ఈ పరిణామాల మధ్యే ఆదివారం పలుచోట్ల ఘర్షణలు జరుగుతుండగానే వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి ప్రయత్నించినట్లుగా చెబుతున్నారు. అయితే మధ్యాహ్నం మూడు గంటలలోపు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారికే అధికారులు అనుమతిచ్చినట్లుగా చెబుతున్నారు. దీంతో రాయచోటిలో వైసీపీ చైర్మన్ అభ్యర్థితోపాటు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయలేకపోయారని అంటున్నారు.రాయచోటిలో మూడు రోజులుగా ఘర్షణలు కొనసాగుతున్నాయి. 16వ తేదీన వైసీపీ కార్యాలయంలో వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. అప్పుడు మొదలైన ఉద్రిక్తతలు మూడు రోజు వరకు కొనసాగాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ కేంద్రానికి సమయం లోగా వెళ్లలేకపోయారని అంటున్నారు. ఇక దర్శిలోనూ ఇదే పరిస్థితి నెలకుందని చెబుతున్నారు. దర్శిలో నామినేషన్ వేయలేక 25 మంది అభ్యర్థులు వెనుదిరిగారు. పిడుగురాళ్లలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి 20 నిమిషాలు ఆలస్యంగా రావడంతో ఎన్నికల అధికారులు అనుమతించలేదు.ఈ పరిణామాలతో మూడు చోట్ల వైసీపీ పోటీ లేకుండానే మున్సిపల్ ఎన్నికలు జరిగే పరిస్థితి ఉందని అంటున్నారు. అయితే అక్కడ ఇప్పటికే నామినేషన్ వేసిన అభ్యర్థులకు వైసీపీ మద్దతు ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ కూటమికి వ్యతిరేకంగా నామినేషన్లు వేసిన వారితో ఉపసంహరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి తొలి ఘట్టం ముగియడంతో నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిళ్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో రాజకీయం ఉత్కంఠ రేపుతోందని అంటున్నారు.

# నెల్లూరులో రూప్‌కుమార్‌కు లక్కు చిక్కేనా.. ?



నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఎవరు ఊహించని విధంగా టిడిపి అధినేత చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల తర్వాత టిడిపిలోకి వచ్చిన రూపు కుమార్ కు మేయర్ స్థానం అప్పగించారు. నిజానికి ప్రస్తుతం మంత్రిగా ఉన్న నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వంటి బలమైన నాయకులు చేసిన లాబీయింగ్ కూడా పక్కనపెట్టి చంద్రబాబు రూప్ కుమార్ కు అవకాశం కల్పించారు. ఇది ఒక రకంగా ఆయనకు లక్ అనే చెప్పాలి. అయితే, అసలు సమస్య ఇప్పుడే మొదలైంది. అంతర్గతంగా రూప్ కుమార్ చుట్టూ విభేదాలు ముసురుతున్నాయి.టీడీపీ కీలక నాయకులు ఆయన ఎంపికను తీవ్రంగా విభేదిస్తున్నారు. స్థానికంగా తీవ్ర ఆరోపణలు ఉన్న రూప్ కుమార్ కు టికెట్ ఇవ్వడం పట్ల సీనియర్ నాయకులు గుస్సాగా ఉన్నారు. ముఖ్యంగా మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సైతం రూప్ కుమార్ ఎంపికపై మౌనంగా ఉండిపోయారు. పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయం కావడంతో పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడడం ఇష్టం లేక వారు సైలెంట్ అయిపోయారు. కానీ, అంతర్గతంగా మాత్రం రూప్ కుమార్ ఎలా గెలుస్తాడో చూస్తామని ఒకరిద్దరు నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం.ఈ నేపథ్యంలో టికెట్ దక్కించుకున్నంత ఈజీగా రూప్ కుమార్‌కు గెలుపు సాధ్యం అవుతుందా అనేది ప్రశ్న. ముఖ్యంగా వైసిపి హయంలో రూపు కుమార్ వ్యవహరించిన తీరు, ఆయినపై వచ్చిన ఆరోపణలు వంటివి ఇప్పటికీ లైవ్ లోనే ఉన్నాయి. వాటిపై గతంలో టిడిపి సీనియర్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. అలాంటిది ఇప్పుడు రూప్ కుమార్ కి అవకాశం ఇవ్వడం పై వారంతా ఆగ్రహంతో ఉన్నారు. అయితే పైకి మాత్రం ఎవరూ మాట్లాడటం లేదు. ఇది ఎన్నికల ప్రచారంపైన, అదేవిధంగా గెలుపు పైన కూడా ప్రభావం చూపించే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.మరీ ముఖ్యంగా టిడిపి క్యాడర్లో రూప్ కుమార్ పై పెద్దగా పాజిటివ్ చర్చ అయితే నడవడం లేదు. ఆయనను ఇప్పటికీ వైసీపీ నుంచి వచ్చిన నాయకుడిగానే చూస్తున్నారు. గతంలో స్థానికంగా పదవులు నిర్వహించి ఉన్నప్పటికీ బలమైన కేడర్‌ను ఆయన సంపాదించుకోలేకపోయారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు స్వయానా బంధువు కావడం, ఆయన అనుచరులే ఈయనకి కూడా పనిచేస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కూటమి పార్టీలను ఐక్యంగా చేయటం వారిని తనవైపు తిప్పుకోవటం అనేది రూప్ కుమార్ కు అత్యంత సంక్లిష్టమైన అంశంగా మారింది.నామినేషన్ వేయడం తేలికే కావచ్చు. కానీ, తీవ్రమైన పోటీలో గెలుపు గుర్రం ఎక్కడం అత్యంత ప్రధానమైన అంశం. దీనికి అన్ని వర్గాలు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. కానీ, ప్రస్తుతం ఆయన పరిస్థితిని గమనిస్తే మంత్రి నారాయణ సహా సీనియర్ నాయకులు అందరూ సైలెంట్ అయిపోవడం రూప్ కుమార్ పట్ల పెద్దగా సానుకూల ధోరణి వ్యక్తం చేయకపోవడం వంటివి పెద్ద సమస్యగా మారుతున్నాయి. దీంతో రూప్ కుమార్ ఏ మేరకు విజయం దక్కించుకుంటారనేది చూడాలి.

# మళ్లీ రంగంలోకి బాబు.. సమస్యలు సెట్‌రైట్.. !



టిడిపి అధినేత చంద్రబాబు మళ్ళీ రంగంలోకి దిగుతున్నారా? పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆయన వరుస పెట్టి సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారా? అవసరమైతే జిల్లాల్లోనూ పర్యటించనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా కూటమి పొత్తులో భాగంగా 20 స్థానాలకు పైగా మున్సిపల్ సీట్లను జనసేనకు కేటాయించారు. ఇది టిడిపి నాయకులు తప్పు పట్టకపోయినప్పటికీ తాము కోరుకున్న స్థానాలను లేదా తమకు బలంగా ఉన్న స్థానాలను జనసేనకు ఇవ్వడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తి వ్యక్తం అవుతోంది.సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏకంగా కన్నీరు పెట్టుకున్న ఉదంతాలు, అలాగే శ్రీకాకుళం లో మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం వంటివి పార్టీలో హైలెట్ గా మారాయి. ఇవి ఒకరకంగా చిన్నవే అయినప్పటికీ ఎన్నికల సమయానికి కూటమిపై ప్రభావం చూపించే అవకాశం ఉందని చంద్రబాబు భావిస్తున్నారు. టిడిపిలో ఎంపికల విషయంలో కూడా తమ్ముళ్లు అసంతృప్తితో ఉన్నారు. తాము కోరుకున్న వారికి లేదా తాము ఆశించిన వారికి అవకాశం కల్పించలేదని అధిష్టానం పై ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇది ఇలా కొనసాగితే పార్టీకి నష్టం వస్తుందని భావిస్తున్న చంద్రబాబు.. నామినేషన్ల పర్వం పూర్తి కాగానే అంటే ఒకటి రెండు రోజుల్లోనే ఆయన పార్టీ నాయకులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నారు. అదేవిధంగా తానే స్వయంగా అవసరమైతే జిల్లాల్లో పర్యటించాలని కూడా నిర్ణయించుకున్నారు. తద్వారా ప్రస్తుతం నెలకొన్న అసంసత్తులు, సమస్యలు పరిష్కారం అవుతాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా టిడిపి గెలుపు ఓటముల కంటే కూడా కూటమిగా ఉన్న జనసేన పార్టీపై ఎక్కువగా చంద్రబాబు దృష్టి పెడుతున్నారనే చెప్పాలి.21 మున్సిపాలిటీ స్థానాలతో పాటు నాలుగు కార్పొరేషన్ స్థానాలను ఇచ్చిన నేపథ్యంలో వాటిలో ఆ పార్టీని గెలిపించుకోవడం ద్వారా కూటమిగా ఐక్యంగా ఉన్నామన్న సంకేతాలను బలంగా పంపించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక చూస్తూ ఊరుకుంటే కుదరదని క్షేత్రస్థాయిలో ఏర్పడిన సమస్యలను తానే స్వయంగా పరిష్కరించాలని చంద్రబాబు నిర్ణయించుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు మంత్రులు.. జిల్లాల ఇన్చార్జి మంత్రులు కూడా స్థానికంగా ఉన్న క్యాడర్ కు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఈ సర్దుబాట్లు పెద్దగా ఫలించే అవకాశం కనిపించడం లేదని అంచనా వేస్తున్న నేపథ్యంలో కచ్చితంగా చంద్రబాబు రంగంలోకి దిగుతారని అంటున్నారు.

# ఏఐని ప్రేయసిగా భావించి.. ఉన్నదంతా అమ్ముకున్నాడు.. చివరకు అసలు నిజం తెలిసి షాక్



సోషల్ మీడియాలో పరిచయం.. చాటింగ్‌తో మొదలైన ప్రేమ.. 1,900 కిలోమీటర్ల ప్రయాణం.. ప్రేయసిని కలవాలన్న ఆశతో ఉన్నదంతా అమ్మేసిన వ్యక్తి.. తీరా అక్కడికి వెళ్లాక తెలిసిన అసలు నిజంతో షాక్.. ఆన్‌లైన్‌లో పరిచయమైన ఓ యువతిని ప్రేమించిన బ్రెజిల్‌కు చెందిన 49 ఏళ్ల వ్యక్తికి ఎదురైన అనుభవం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాను ప్రేమించిన యువతి నిజమైన వ్యక్తి కాదని.. ఏఐ సాయంతో సృష్టించిన పాత్ర అని తెలిసి అతడు నిర్ఘాంతపోయాడు.

**సోషల్ మీడియా పరిచయం.. ప్రేమగా మారిన చాటింగ్..**

టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ మనుషుల జీవితాల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారా కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవడం.. స్నేహాలు చేయడం.. ప్రేమలో పడటం సాధారణమైపోయింది. అయితే ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి వ్యక్తి నిజమైనవారేనా? వారి వెనుక ఉన్నది అసలు మనిషేనా? అనే విషయాలను నిర్ధారించుకోకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో తెలియజేసే ఘటన బ్రెజిల్‌లో చోటుచేసుకున్నట్లు సమాచారం. బ్రెజిల్‌కు చెందిన మార్టిన్స్ అనే 49 ఏళ్ల వ్యక్తికి 2020లో జెస్సికా పేరుతో ఉన్న ఓ సోషల్ మీడియా ఖాతా ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ ఖాతాలో ఉన్న యువతి ఫొటోను చూసిన అతడు ఆమె పట్ల ఆకర్షితుడయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్ కొనసాగడంతో ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారింది. తనతో మాట్లాడుతున్నది నిజమైన యువతేనని నమ్మిన మార్టిన్స్.. ఆమెనే తన జీవిత భాగస్వామిగా ఊహించుకున్నాడు.

**1,900 కిలోమీటర్ల దూరం.. ప్రేయసిని కలవాలన్న ఆరాటం..**

ఆన్‌లైన్‌లో సాగిన పరిచయం.. చాటింగ్‌తోనే ఆగిపోలేదు. తన ప్రేయసిని ప్రత్యక్షంగా కలవాలన్న కోరిక మార్టిన్స్‌లో బలంగా పెరిగింది. ఆమెను చూసేందుకు సుమారు 1,900 కిలోమీటర్ల దూరం ప్రయాణించేందుకు కూడా సిద్ధపడ్డాడు. ఇందుకోసం బస్సు ప్రయాణానికి అవసరమైన డబ్బును సమకూర్చుకోవడానికి తన వద్ద ఉన్న వస్తువులను, ఆస్తులను అమ్ముకున్నట్లు సమాచారం.

ప్రేమించిన వ్యక్తిని కలుసుకోవాలన్న ఆశతో ఇంతటి సాహసానికి సిద్ధపడిన మార్టిన్స్.. తన ప్రయాణం తన జీవితంలోనే అతిపెద్ద నిరాశగా మారుతుందని ఊహించలేకపోయాడు. తాను ఎంతోకాలంగా చాటింగ్ చేస్తున్న యువతిని ప్రత్యక్షంగా చూసి.. ఆమెతో సమయం గడపవచ్చని ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఆ ఆశలతోనే బ్రెజిల్ లోని బెలో హెరిజోంటె నగరానికి చేరుకున్నాడు.

**చివరకు తెలిసిన నిజం.. అంతా ఏఐ మాయ..**

అయితే అక్కడికి చేరుకున్న తర్వాతే మార్టిన్స్‌కు అసలు విషయం తెలిసింది. తాను ప్రేమించిన జెస్సికా నిజమైన యువతి కాదని, ఓ వ్యక్తి ఏఐ సాయంతో సృష్టించిన క్యారెక్టర్ అని తెలుసుకుని షాక్‌కు గురయ్యాడు. తాను ఇన్నాళ్లూ ప్రేమించానని భావించిన వ్యక్తి వాస్తవంగా ఉనికిలోనే లేదన్న విషయం అతడిని తీవ్ర నిరాశకు గురిచేసింది. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. తాను ఏఐతో చాట్ చేస్తున్నాననే అనుమానం తనకు ఎప్పుడూ రాలేదని మార్టిన్స్ చెప్పడం. ఆన్‌లైన్‌లో జరిగిన సంభాషణలను నిజమైన ప్రేమగా భావించి.. ఆమెను కలుసుకోవడానికి తనకున్నదంతా ఖర్చు చేయడం ఈ ఘటనలో ప్రధానంగా చర్చకు వస్తోంది.

**ఏఐ యుగంలో ఆన్‌లైన్ ప్రేమకు కొత్త సవాళ్లు**

కృత్రిమ మేధస్సు సాయంతో మనుషులను పోలిన ఫొటోలు, వీడియోలు, స్వరాలు, సంభాషణలు సృష్టించడం ఇప్పుడు మరింత సులభమవుతోంది. దీంతో సోషల్ మీడియాలో కనిపించే ఫొటోలు, ప్రొఫైళ్లు, సందేశాలు నిజమైన వ్యక్తులకు సంబంధించినవేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఏఐ ఆధారిత క్యారెక్టర్లు వినోదం, సమాచార సేవలు,

వర్చువల్ స్నేహం వంటి అవసరాలకు ఉపయోగపడుతున్నప్పటికీ.. వాటి అసలు స్వరూపాన్ని దాచిపెట్టి వ్యక్తిగత సంబంధాలను పెంచుకోవడం సమస్యలకు దారితీయవచ్చు.ముఖ్యంగా ఆన్‌లైన్ పరిచయాల విషయంలో భావోద్వేగాలకు లోనై ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం ప్రమాదకరం. ప్రత్యక్షంగా కలవని వ్యక్తుల కోసం డబ్బు పంపించడం.. అప్పులు చేయడం.. ఆస్తులు అమ్మేకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. అలాగే అనుమానాస్పద ఖాతాల వెనుక ఉన్న వ్యక్తుల నిజస్వరూపాన్ని నిర్ధారించుకోవడం అవసరం. మార్టిన్స్‌కు ఎదురైన అనుభవం టెక్నాలజీని ఉపయోగించడంలో అప్రమత్తత ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. ఆన్‌లైన్‌లో ఏర్పడిన ప్రతి బంధాన్ని గుడ్డిగా నమ్మడం కంటే.. నిజానిజాలను తెలుసుకున్న తర్వాతే ముందడుగు వేయాలి. ఎందుకంటే.. డిజిటల్ ప్రపంచంలో కనిపించే ప్రేమ నిజమైనదే కావాలని లేదు. కొన్నిసార్లు అది మనిషి సృష్టించిన పాత్ర కావచ్చు.. మరికొన్నిసార్లు ఏఐ సృష్టించిన మాయ కూడా కావచ్చు.. సో బీ కేర్ ఫుల్ నాయనలారా..

# మండుతోన్న యూరోప్.. అసలు కారణమేంటి?

ప్రశాంతమైన జీవనానికి.. సంపన్న సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తాయి యూరోపియన్ దేశాలు. చరిత్రలోకి వెళితే ఒకప్పుడు ప్రపంచాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని వందలాది దేశాల్ని శాసించటమే కాదు.. భారీ ఎత్తున సహజ వనరులను కొల్లగొట్టటం..తమ ఆధిక్యతను నిలుపుకోవటానికి కోట్లాది మంది ప్రాణాలను తీసేందుకు సైతం వెనుకాడని చరిత్ర యూరోప్ సొంతం. దాదాపు 500 ఏళ్లు ఐరోపా ఖండానికి చెందిన బ్రిటన్.. ఫ్రాన్స్.. పోర్చుగల్.. డచ్.. బెల్జియం..దేశాలు ప్రపంచంలోని పలు దేశాల్ని వలసవాదంతో పాలించాయి. వారి సహజవనరుల్ని కొల్లగొట్టాయి. భారతదేశంతో పాటు పలు ఆసియా దేశాల్ని.. ఆఫ్రికా ఖండంలోని దేశాలు మాత్రమే కాదు.. ఇప్పటి ప్రపంచానికి పెద్దన్న అమెరికాను సైతం యూరోపియన్ దేశాలే పాలించాయి.



ప్రపంచ దేశాల సంపదను.. వనరులను దోచుకోవటంలో ఏ మాత్రం మొహమాటం.. పాపభీతిని ప్రదర్శించని ఈ దేశాలు ఆర్థికంగా బలపడటమే కాదు.. సంపన్నంగా మారాయి. విలాసవంతమైన జీవనానికి తెర తీశాయి. వారి అధీనంలోని వలస రాజ్యాలు స్వాతంత్ర్యాన్ని సొంతం చేసుకోవటం.. ఏ దేశానికి ఆ దేశం తమ అస్తిత్వాన్ని చాటుకోవటంతో కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని ఏలిన ఆ దేశాలు ఇప్పుడు అశాంతికి చిహ్నాలుగా మారాయి. ఉపాధి కోసం.. పెరిగిన ధరలు.. విద్యా వ్యవస్థల్లో మార్పులు తీసుకురావాలంటూ తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆయా దేశాలకు చెందిన పౌరులు రోడ్ల మీదకు వస్తున్నారు. సొంత ప్రభుత్వాల మీదే ఆందోళనలు చేస్తూ.. న్యాయం చేయాలంటూ ఉద్యమిస్తున్న వైనం ఇప్పుడు యూరోప్ లోని పలు దేశాల్లో కనిపిస్తోంది.ఐక్యరాజ్య సమితి అధికారికంగా గుర్తింపు ప్రకారం ఐరోపా ఖండంలో మొత్తం 44 దేశాలు ఉండగా.. యూరోపియన్ యూనియన్ లో మాత్రం 27 దేశాలు ఉన్నాయి. వారందరికి ఒకే కరెన్సీ (యూరో) చెలామణిలో ఉన్న సంగతి తెలిసిందే. యూరోప్ దేశాలకు భౌగోళిక సరిహద్దులుగా రష్యా.. టర్కీ.. కజకిస్తాన్.. జార్జియా.. అజర్ బైజాన్ లాంటి దేశాలు ఉన్నాయి. తాజాగా నిరసనలతో అట్టుడుగుతున్న దేశాలుగా ఫ్రాన్స్.. బెల్జియం.. పోర్చుగల్.. ఇటలీ.. గ్రీస్.. అల్బేనియా.. జర్మనీ దేశాల్లో నిరసనకారుల నిరసనలతో మండుతున్నాయి. అక్కడి ప్రభుత్వాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.ఫ్రాన్స్ విషయానికి వస్తే.. అక్కడి స్కూళ్లలో మౌలిక వసతుల కొరత.. టీచర్ల కొరతతో పాటు.. పెరిగిన జీవన వ్యయం.. ఇంధన ధరల పెంపునకు వ్యతిరేకంగా భారీ ఎత్తున ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. అక్టోబరు 17-18 తేదీల్లో జరిగిన నిరసనల్లో లక్షలాది మంది పాల్గొనటం గమనార్హం. పారిస్.. మార్సేయ్ లాంటి నగరాల్లోని ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు జరగటం గమనార్హం. బెల్జియం విషయానికి వస్తే..అక్కడి వర్సిటీ రిజిస్ట్రేషన్ ఫీజుల పెంపు.. విద్యారంగంలో బడ్జెట్కోతలు.. నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలపై అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. విద్యార్థుల నిరసనలతో రాజధాని బ్రస్సెల్స్ నగరం అట్టుడుతోంది. ఆందోళనకారులను అడ్డుకోవటం కోసం పోలీసుల లాఠీ ఛార్జ్ తో పాటు టియర్ గ్యాస్.. వాటర్ క్యానన్లను ప్రయోగించాల్సిన పరిస్థితి.పోర్చుగల్ విషయానికి వస్తే తక్కువ వేతనాలు.. జీవన వ్యయాలు పెరగటంతో పాటు ఆ దేశంలోని ప్రధాన నగరాల్లో ఇంటి అద్దెలు భారీగా పెరగటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇటలీలో పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా భారీ నిరసనలుచోటు చేసుకుంటున్నాయి. సామాజిక సంక్షేమ బడ్జెట్లను కాపాడాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇక.. విద్యా సంస్కరణలు.. బడ్జెట్ కోతలు.. ఆర్థిక ఇబ్బందులపై గ్రీస్.. అల్బేనియా.. జర్మనీ దేశాల్లో నిరసనకారులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళనలు కొన్నిచోట్ల హింసాత్మక ఘటనలకు కారణంగా మారుతున్నాయి.ఎందుకిలా జరుగుతోంది? అన్న ప్రశ్నకు సమాధానం వెతికితే.. ఆసక్తికర అంశాలు తెర మీదకు వస్తాయి. డోమినో ఎఫెక్ట్ గా కొందరు విశ్లేషిస్తున్నారు. ఒక దేశంలో విజయవంతమైన పోరాటం.. దాని పక్కనే ఉన్న దేశంలోని ప్రజల్లో స్ఫూర్తిని నింపటంతో పాటు.. తెర వెనుక ఉన్న కొన్ని శక్తులు.. వ్యవస్థాగత లోపాలను ఎత్తి చూపుతూ ఆందోళనలకు తెర తీస్తున్నారు. దీంతో నిరసనలు పెరుగుతున్న దేశాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. చైన్ సిస్టం మాదిరిగా ఉన్న నిరసనలకు సోషల్ మీడియా (టిక్ టాక్.. టెలిగ్రామ్.. ఎక్స్.. యూట్యూబ్.. ఇన్ స్టా) కీలకంగా మారుతున్నాయి.

ఆందోళనకారులు.. నిరసనకారులు తమ వాదనల్ని వినిపించేందుకు ఈ వేదికల్ని ఆయుధాలుగా వినియోగిస్తున్నాయి. తమదైన నెరేటివ్ ను క్రియేట్ చేసి జనాల మీదకు వదులుతున్నాయి. ఒక దేశంలోని నిరసనలు.. మరో దేశంలోని ఆందోళనకారులకు స్ఫూర్తిగా మారుతున్నాయి. ఫ్రాన్స్ లో విద్యార్థులు.. కార్మికులు రోడ్ల మీదకు వచ్చి అక్కడి ప్రభుత్వానికి చెమటలు పట్టించిన విజువల్స్ నిమిషాల వ్యవధిలో ఆ దేశానికి దగ్గర్లోని బెల్జియం.. పోర్చుగల్ యూత్ కు చేరటం.. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనల బాట పట్టటమే అన్న భావన యువతలో వేగంగా పెరుగుతోంది. దీనికి తోడు ఐరోపా వ్యాప్తంగా ఉన్నకార్మిక సంఘాలు.. విద్యార్థి సంఘాలు డిజిటల్ గ్రూపుల ద్వారా కనెక్ట్ అవుతూ.. తమ నిరసనల వ్యూహాలను. .నినాదాలను మరో దేశానికి ఆందోళనలకు ముడి సరుకుగా అందిస్తున్నాయి.యూరోప్ లో జరుగుతున్న ఈ వరుస ఆందోళన వెనుక బయట శక్తులు కూడా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉక్రెయిన్ - రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ కు ఐరోపా దేశాలు మద్దతు ఇస్తున్నాయి. దీనికి ప్రతీకారంగా రష్యా లాంటి దేశాల డిజిటల్ వేదికల్ని ఆయుధాలుగా మార్చుకొని ఆ దేశాల్లోని అంతర్గత సమస్యల మీద ఫోకస్ చేస్తున్నట్లుగా కొన్ని వాదనలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో నిరసనలను మరింత పెంచేలా ఫేక్ అకౌంట్లు.. బాట్లు కుప్పలుగా

వెల్లువెత్తుతూ.. సరికొత్త సవాళ్లను విసురుతున్నట్లుగా చెబుతున్నారు. దీంతో పాటు గడిచిన కొన్నేళ్లుగా మధ్యప్రాచ్యం.. ఆఫ్రికా దేశాల నుంచి వలసలు భారీ ఎత్తున పెరగాయి. దీంతో.. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు తగ్గాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ నిధులు వలసదారులకు వెళుతున్నాయన్న అసంతృప్తి అంతకంతకూ పెరిగి ఆగ్రహంగా మారినట్లుగా చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. ఒకప్పుడు ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో ఉంచుకొని వారిపై అధికారం చెలాయించారో.. ఇప్పుడు ఆయా దేశాలకు చెందిన వలసలు ఐరోపా దేశాల్లో కలకలాన్ని క్రియేట్ చేస్తున్న వైనం చూస్తే..కర్మ ఎవరిని వదిలి పెట్టదన్న భావన కలుగక మానదు. కాకపోతే కొన్ని దశాబ్దాల సమయం పట్టిందంతే.

## కొవ్వూరు రాజకీయాల్లో ట్విస్టుల మీద ట్విస్టులు.. రెండు పార్టీల అభ్యర్థుల ఎంపికలోనూ గందరగోళం




గోదావరి జిల్లాల్లోని ప్రధానమైన కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఇక్కడ ప్రధాన పార్టీలు రెండింటి లోనూ గందరగోళమే రాజ్యమేలుతోంది. అధికార టీడీపీ కూటమిలో స్థానిక నేతలు అంతా ఒక అభ్యర్థిని పోటీకి దింపగా, అధిష్టానం అనూహ్యంగా వేరొకరికి పేరును ఖరారు చేసింది. స్థానిక నాయకులు అంతా తాము అనుకున్న అభ్యర్థితో నామినేషన్ వేయించగా, పార్టీ అధిష్టానం విడుదల చేసిన జాబితాలో వేరే నేత పేరు చూసి కంగుతిన్నారు. అటు విపక్షం వైసీపీలోనూ ఇంచుమించు ఇటువంటి పరిస్థితే నెలకొంది. పార్టీ తరపున చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించిన నేత పోటీకి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా పోయారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ అధిష్టానం కంగారు పడుతోందని అంటున్నారు.

**షాక్ ఇచ్చిన టీడీపీ అధిష్టానం**

కొవ్వూరు టీడీపీలో అధిష్టానం నిర్ణయం కార్యకర్తలను షాక్ కు గురిచేసింది. ఈ మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతోపాటు పార్టీ సీనియర్ నేత మద్దిపట్ల శివరామకృష్ణ మద్దతుతో పార్టీ అభ్యర్థిగా కంతామణి విజయలక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. వందలాది మంది పార్టీ కార్యకర్తల సమక్షంలో అట్టహాసంగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఇంతలోనే రెండో విడత జాబితా విడుదల చేసిన టీడీపీ అధిష్టానం కొవ్వూరు సీటును జొన్నలగడ్డ రాధారాణికి ఖరారు చేసింది. ఈ పరిణామంతో పార్టీ కార్యకర్తలు నేతలు కంగుతిన్నారు. తాము విజయలక్ష్మి పేరునే అధిష్టానానికి సూచించగా, అధిష్టానం రాధారాణి పేరును ఎలా ఎంపిక చేసిందో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, పార్టీ నేత శివరామకృష్ణ చెబుతున్నారు.

**నిర్ణయం మారుతుందా?**

పార్టీ నేతలు అంతా ఒకరిని అనుకుంటే, అధిష్టానం వేరొకరికి అవకాశం ఇవ్వడం పట్ల కార్యకర్తల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధిష్టానం నిర్ణయాన్ని నిరసిస్తూ పార్టీ స్థానిక కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. తమ నేత కంతమణి విజయలక్ష్మికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, స్థానిక నాయకుల అభీష్టానికి భిన్నంగా అధిష్టానం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జొన్నల గడ్డ రాధారాణికి సీటు ఎలా కేటాయించిందో అర్థం కావడం లేదని కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. స్థానిక నేతలు ఎవరో రహస్యంగా సహకరించి ఉంటారని అనుమానిస్తున్నారు. కార్యకర్తల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో అధిష్టానం నిర్ణయం మార్చుకుంటుందా? లేదా? అనేది చూడాల్సివుందని అంటున్నారు.

**వైసీపీ నుంచి పోటీకి విముఖత**

ఇక విపక్షం వైసీపీలోనూ పరిస్థితులు గందరగోళంగానే ఉన్నాయి. ఇక్కడ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన మన్నె పద్మ పోటీకి విముఖతగా ఉన్నట్లు చెబుతున్నారు. పార్టీ తన పేరు ప్రకటించిన తర్వాత ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. దీంతో పార్టీ నేతలు, మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, తలారి వెంకటరావు తదితరులు ఆమెను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని అంటున్నారు. పద్మ తండ్రి స్థానికంగా మంచి పట్టున్న నేతగా చెబుతున్నారు. ఐదుసార్లు మున్సిపల్ చైర్మన్ గా పనిచేశారు. ఎమ్మెల్సీగానూ పనిచేశారు. దీంతో ఆయన కుమార్తెను వైసీపీ ఎంపిక చేసింది. అయితే కూటమి పార్టీలు బలంగా ఉన్న నేపథ్యంలో విజయంపై నమ్మకం లేక పద్మ తప్పుకున్నట్లుగా చెబుతున్నారు. మొత్తానికి కొవ్వూరులో రాజకీయాలు రసవత్తరంగా ఉన్నాయి. ఈ రోజు నామినేషన్లకు చివరి రోజు కావడంతో వైసీపీ ఎవరిని రంగంలోకి దింపుతుందో చూడాల్సివుందని అంటున్నారు.

## ఉద్యోగుల కోసం డేటింగ్ యాప్.. ప్రేమ పెళ్లిళ్ల బాధ్యత కూడా ప్రభుత్వానిదేనా?



ప్రేమించడం వ్యక్తిగత విషయం.. జీవిత భాగస్వామిని వెతుక్కోవడం ఎవరి ఇష్టం వారిది. కానీ సింగపూర్‌లో మాత్రం ఈ విషయంలో ప్రభుత్వమే కాస్త చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దేశంలో జననాల రేటు తగ్గిపోతుండటంతో ప్రజలు తమకు సరైన భాగస్వామిని వెతుక్కునేందుకు 'ఫస్ట్‌డేట్' (ఖీఅతీర్ణఆఖ్వ) పేరుతో ఓ డేటింగ్ యాప్‌ను పరీక్షిస్తున్నట్లు సమాచారం.ఈ యాప్‌ను 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందించినట్లు నివేదికలు చెబుతున్నాయి. పెళ్లి చేసుకోవాలనే ఆసక్తి ఉన్నవారికి వారి అభిరుచులు, హాబీలు, జీవనశైలి ఆధారంగా సరైన జోడీని సూచించడం దీని ఉద్దేశం. సాధారణ డేటింగ్ యాప్‌ల మాదిరిగా ఒకేసారి చాలామందితో పరిచయం పెంచుకునే అవకాశం కాకుండా, ఒక్కోసారి ఒకరితో మాత్రమే కనెక్ట్ అయ్యే విధానం ఇందులో ఉన్నట్లు సమాచారం. వినియోగదారులు ప్రభుత్వ డిజిటల్ ఐడీ ద్వారా తమ గుర్తింపును కూడా ధ్రువీకరించుకోవాలి.2025లో సింగపూర్‌లో 30 వేల కంటే తక్కువ మంది పిల్లలు జన్మించినట్లు నివేదికలు వెల్లడించాయి. దీంతో భవిష్యత్తులో జనాభా పరిస్థితిపై అక్కడ ఆందోళనలు పెరుగుతున్నాయి.ఇక అసలు ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ప్రేమ కోసం యాప్‌లలో వెతుకులాట సాగించే రోజుల్లో, ఇప్పుడు ప్రభుత్వమే జోడీని వెతికే ప్రయత్నం చేస్తోందన్నమాట! అయితే ఇందులోనూ కొన్ని షరతులున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులే ఎందుకు? 35 ఏళ్లు దాటినవారికి ప్రేమించే అవకాశం లేదా? ప్రైవేట్ ఉద్యోగులు మాత్రం ఏం పాపం చేశారు? అంటూ ప్రశ్నలు రావడం సహజం.ప్రస్తుతం ఈ కార్యక్రమం ప్రయోగాత్మక దశలో ఉన్నట్లు సమాచారం. ఇది ఎంతవరకు విజయవంతమవుతుందో చూడాలి. చివరికి ఈ యాప్ ఎన్ని జంటలను కలుపుతుంది, జననాల రేటుపై ఎంత ప్రభావం చూపుతుంది అన్నది భవిష్యత్తే చెప్పాలి. ఏదేమైనా, ప్రేమకు కూడా ప్రభుత్వ ప్రణాళికలు అవసరమయ్యే పరిస్థితి వచ్చిందన్నమాట!

# సంపాదకీయం

## అమెరికా చలిమంటలకు ఏ చమురు అనర్హం!

అవకాశవాదం... అమెరికా.. ఈ రెండిటినీ విడదీసి చూడటం అసాధ్యం. ప్రపంచానికి ఎన్ని ఆదర్శాలను అమెరికా చెప్పిందో అంతకుమించి అవకాశవాదాలనూ ప్రదర్శించింది. స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికీ, ఆనందాన్ని అనుభవించటానికీ పుట్టుకతోనే మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని చాలా గొప్పగా తన స్వాతంత్ర్య ప్రకటనలో చెప్పిన అమెరికా దాన్ని ఏనాడూ పాటించలేదు. ఆఫ్రికా నుంచి కొనుగోలు చేసి అమెరికాకు తెచ్చిన లక్షలాది నల్లజాతీయులకు ఆ హక్కులను ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బానిసత్వాన్ని సహజసిద్ధమైన వ్యవస్థగా ఆమోదించి దశాబ్దాలపాటు దాన్ని అమలుచేసింది. 1965 వరకూ నల్లజాతీయులకు సమానహక్కులను ఇవ్వలేదు. అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకూ దేశాధికారాన్ని విస్తరించే క్రమంలో వందలాది ఆదిమ తెగలను హరించివేసింది. ప్రజాస్వామ్య రాజకీయాలనూ, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రైవేటు వ్యాపారాలనూ ప్రపంచమంతా విస్తరించటమే తన లక్ష్యాలని చెబుతూ అనేక దేశాల్లో నియంతృత్వ ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా నిలిచింది. మత, ఛాందసవాద సమూహాలను ప్రోత్సహించింది. ప్రపంచ ప్రయోజనాల పేరుతో నిన్నటి దాకా తప్పు.. తప్పు.. అని చెప్పి.. ఒక్కరోజులోనే దాన్ని ఒప్పు.. ఒప్పు అనగలిగిన అవకాశవాద నేర్పరితనం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఘనంగా చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. నాలుగేళ్లకు పైగా సాగుతోన్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమే అట్టుడికిపోతోంది. రష్యాది దురాక్రమణగా భావించిన అమెరికా ఎన్ని ఆంక్షలు విధించాలో అన్నీ విధించింది. ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలను అదిరించి బెదిరించి లొంగదీసుకుంది. భారత్ కూడా ఒకదశలో రష్యా నుంచి కొనుగోళ్లను దాదాపుగా ఆపివేసింది. రష్యాతో లావాదేవీలను నడిపే దేశాలపై దిగుమతి సుంకాలనూ అమెరికా పెద్దఎత్తున విధించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే పేరుతో విదేశాల్లో ఉన్న రష్యా ఆస్తులనూ స్తంభింపచేసింది. ఇంతటి శత్రుపూరిత వైఖరిని అతి తేలికగా మార్చుకుని అవకాశవాదంలో తనకు సాటిలేదనే విషయాన్ని అమెరికా మరోమారు స్పష్టంచేసింది. ఇలాంటి అవకాశవాదాన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా నిర్వాకాలపై గతంలో లోతైన విశ్లేషణలూ, కవిత్వాలూ చాలానే వచ్చాయి. 1961లో మహాకవి శ్రీశ్రీ కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెన్నడీని ఉద్దేశిస్తూ కవిత రాశారు. 'అరువులిచ్చి కరువు తెచ్చి.. రుణంపెట్టి రణం తెచ్చి.. జనంధనం ఇంధనమై.. చరణ కరాబంధనమై.. జనన జరా మరణ దురాక్రమణల సంగ్రంథనమై.. ఒకనాడోహో అనిపించుక తిరిగిన.. ధనికవాద మికపై వెగటై జిగటై..' అంటూ ఆనాడు శ్రీశ్రీ రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇప్పటికీ బాగా సరిపోతాయి. ట్రంప్ హయాంలో అమెరికా ధనికవాదం వెగటై.. జిగటై గతంలో ఎన్నడూ లేనంతగా అసహ్యం పుట్టిస్తోంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షులైన అబ్రహం లింకన్, జాన్.ఎఫ్.కెన్నడీ లాంటి వారు వ్యక్తంచేసిన ఆదర్శ అభిప్రాయాలకు ప్రభావితమైన ప్రజాస్వామ్య ప్రియులు చాలామందే ఉండేవారు. ట్రంప్ లాంటి వాళ్లకు అట్లాంటివేవీ లేవు కనుక ప్రతి విధానమూ, ప్రతి ప్రకటనా ఇప్పుడు వెగటుగానే అనిపిస్తోంది. అన్నింట్లోనూ అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామనీ, అందుకు అడ్డుగా ఉన్న అంతర్జాతీయ చట్టాలనూ, సంస్థలనూ, ఒప్పందాలనూ కాలరాస్తామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే చెబుతుంటే నాగరీక మనుషులు సహించలేరు. వేల సంవత్సరాల సంస్కృతులు కలిగి, సుదీర్ఘ చరిత్రలో మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేసిన చైనా, భారత్ లాంటి దేశాల్లో గతం గురించి సమగ్ర అవగాహన పెరుగుతున్న కొద్దీ అమెరికాపై అసహనం ఎక్కువవుతుందే తప్ప తగ్గదు.

అమెరికా మద్దతు లేకపోతే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ఇంతకాలం కొనసాగి ఉండేది కాదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రజాస్వామ్యవాది కాదు. ఆ దేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలూ లేవు. నియంతల మనుగడకూ కొన్ని అంశాలు.. ముఖ్యంగా జాతి ప్రయోజనం, గౌరవం, భద్రత పేరుతో కూడినవి.. చాలా బాగా ఉపయోగపడతాయి. అమెరికా సారథ్యంలోని నాటో కూటమి స్వార్థం, అహంకారంతో వేసిన తప్పటడుగులు రష్యాను ఉక్రెయిన్ మీదకు ఉసిగొల్పేలా చేయగలిగాయి. జర్మనీ ఏకీకరణ (1990) సందర్భంగా నాటో విస్తరణ ఒక్క అంగుళం కూడా అదనంగా ఉండదని ఆనాటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడైన మిఖాయిల్ గోర్బచెవ్‌కు అమెరికా హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకే జర్మనీ ఏకీకరణ సాఫీగా సాగటానికి సోవియట్ యూనియన్ సహకరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే సోవియట్ యూనియన్ (1991 డిసెంబర్ 26) పతనమైంది. రష్యా సహా 15 దేశాలు విడివిడిగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో 9 దేశాలు క్రమంగా నాటోలో చేరిపోయాయి. ఒక్క అంగుళం హామీ అలా గాల్లో కలిసిపోయింది. రష్యాలో 2000 సంవత్సరం వరకూ ఆర్థికంగా అల్లకల్లోల పరిస్థితులే ఉన్నాయి. వీటికీ ఒక రకంగా అమెరికాయే కారణం. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను ఒక్కపెట్టున ప్రైవేటుపరం చేయటంతో పరిస్థితులు గాడితప్పాయి. ప్రభుత్వ సంస్థలనూ, కంపెనీలనూ కారుచౌకగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టారు. అన్నిటినీ మార్కెట్‌కే వదలివేయటంతో ధరలూ, నిరుద్యోగమూ విజృంభించాయి. బ్లాక్‌మార్కెట్ సర్వసాధారణమైంది. విద్య, వైద్యరంగం, ప్రాథమిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో జీవన ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేటురంగంతో పోటీ పెరిగి రష్యా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్న జోస్యాలు ఏ రకంగానూ నిజంకాలేదు. ఒకరకంగా అరాచకమే ప్రబలిపోయింది. అట్లా అమెరికా ప్రభుత్వమూ, ఆ దేశ మేధావులూ సూచించిన విధానాలు అస్తవ్యస్త పరిస్థితులకే దారితీశాయి. పుతిన్ అధికారాన్ని చేజిక్కించుకోటానికి అవే కారణమయ్యాయి. ఆ నేపథ్యంలోనే రష్యాకు మళ్లీ ఒకనాటి వైభవాన్ని తీసుకువస్తానన్న పుతిన్ వాగ్దానాలు ప్రజలపై ప్రభావాన్ని కలగచేశాయి. ఒక భాష, ఒక మతం, ఒక జాతి (జ్ఞ్ట్రఅఒఎ జశీఎఎబఅఱఎ) దేశ అస్తిత్వానికి పునాదిగా ఉన్నచోట భావోద్వేగాలను రెచ్చగొట్టటం తేలిక. రష్యాకు చుట్టూ ప్రమాదం ముంచుకొస్తోందన్న పుతిన్ ప్రచారానికి ఆ ఉద్వేగాలు తోడ్పడ్డాయి. ఉక్రెయిన్, జార్జియాలు కూడా భవిష్యత్తులో నాటోలో చేరతాయన్న ప్రకటనతో (2008) రష్యాలో భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక అక్కడి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా బాగా దృష్టి పెట్టింది. రష్యాకు అనుకూలంగా ఉండే ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యానుకోవిట్ అధికారాన్ని కోల్పోవటంలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల పాత్ర చాలా ఉంది. మైదాన్ విప్లవం పేరుతో ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలకు అమెరికా పూర్తిగా సహకరించింది. ఆ వెంటనే క్రిమియాను రష్యా ఆక్రమించింది. ఉక్రెయిన్‌లోని రష్యా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లను ప్రోత్సహించింది. చివరికి 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగింది. ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కింద అమెరికా ఈ ఏడాది మార్చివరకూ రూ.12 లక్షల కోట్లను ఖర్చుపెట్టింది. మొత్తంగా రూ.17 లక్షల కోట్లు వ్యయం అవుతాయని లెక్కలుకట్టింది. ఇవిగాక ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రూ.1.90 లక్షల కోట్లను రుణంగా ఇప్పించింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరో రూ.22 లక్షల కోట్లను ఉక్రెయిన్ యుద్ధానికి ఖర్చు చేస్తోంది. అంటే అమెరికా, ఈయూ కలిసి దాదాపు రూ.40 లక్షల కోట్లను వెచ్చిస్తున్నాయి. ఉక్రెయిన్ తటస్థ దేశంగా ఉంటుందనీ, నాటో కూటమిలో చేర్చుకునేది లేదనీ స్పష్టంచేయకుండా, నాలుగున్నర ఏళ్ల నుంచీ దౌత్యపరమైన చొరవను ప్రదర్శించకుండా, లక్షల మరణాలకూ, భౌతిక ఆస్తుల విధ్వంసానికి అమెరికాయే ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష కారణమైంది. ఇంతగా కకావికలు చేసి మధ్యంతర ఎన్నికల్లో గెలవటానికి రష్యా చమురు కొనుగోలునే అస్త్రంగా చేసుకుని రాజకీయంగా దిగజారిపోతున్న ప్రతిష్ఠను కాపాడుకోటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అవసరమైతే మళ్లీ రష్యా చమురు అమ్మకాలపై నిషేధాన్ని విధించొచ్చు. యుద్ధం వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణనష్టం లక్షల్లో ఉంది. అనధికార అంచనాల ప్రకారమే ఇరు దేశాలకు చెందిన 6 లక్షల మంది సైనికులు మరణించారు. ఇందులో రష్యను సైనికులే నాలుగున్నర లక్షల దాకా ఉండొచ్చు. పౌరులు 20 వేల మంది చనిపోయి ఉంటారన్నది అంచనా. గాయపడిన వాళ్లు 15 లక్షల దాకా ఉండొచ్చు. ఆస్తుల విధ్వంసం, ఆర్థిక వ్యవస్థకు ఇతరత్రా జరిగిన నష్టం ఉక్రెయిన్‌లోనే రూ.82 లక్షల కోట్లు ఉంటుంది. యుద్ధం ముగిస్తే ఆ దేశంలో పునర్ నిర్మాణానికి రూ.56 లక్షల కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఇక రష్యాలో జరిగిన నష్టం గురించి అంచనాలు బయటకు రావటం లేదు. ఉక్రెయిన్‌తో పోల్చితే అది నాలుగో వంతే ఉండొచ్చు. ఈ శతాబ్దంలో అమెరికా ప్రత్యక్షంగా యుద్ధాలు చేసిన చోటా (అఫ్ఘానిస్థాన్, ఇరాక్), పరోక్షంగా యుద్ధాలను రగిల్చిన చోటా ఎక్కడా శాంతిని నెలకొల్పిన దాఖలాల్లేవు.

# ఇకనైనా ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లకు నీళ్లు ఆపండి!

రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బతీసింది. వర్షాభావం, అడుగంటిపోతున్న భూగర్భ జలాలు, ఖాళీ అవుతున్న రిజర్వాయర్లు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే పెసర, మినుము, సోయాబీన్ వంటి పంటలు కోతకు వస్తుండగా, మిగిలిన పంటలు నీరందక ఎండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండిపోవడంతో పాటు విద్యుత్ కోతలు సర్వసాధారణమయ్యాయి. యూనిట్‌కు పది రూపాయలు చెల్లించి కొందామన్నా మార్కెట్‌లో విద్యుత్ లభించని పరిస్థితి ఉందని ప్రభుత్వమే ప్రకటించడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్ర వ్యవసాయానికి ఆధారమైన నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం తీవ్రంగా పడిపోయింది. ఈ రుతుపవనాల సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు కాగా, గత సంవత్సరం జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 988.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కానీ ఈ ఏడాది అదే కాలంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 జిల్లాలు మాత్రమే సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయగా, ఏకంగా 17 జిల్లాల్లో 20శాతం నుంచి 59 శాతం వరకు లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో 848.77 టీఎంసీల నీరు ఉండగా, ఈ ఏడాది అది 475.57 టీఎంసీలకు పడిపోయింది.



ఉపరితల నీటి లభ్యత తగ్గడంతో రైతులు బోర్లపై విపరీతంగా ఆధారపడ్డారు. దీనికి తోడు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, పత్తి పంటలను విస్తృతంగా సాగు చేయడంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటు భూగర్భ జలమట్టం గత ఏడాది ఆగస్టులో 5.78 మీటర్లు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు నాటికి 7.87 మీటర్లకు పడిపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా, ఈసారి 1,25,85,426 ఎకరాలకు పరిమితమైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 65,95,645 ఎకరాలు కాగా, గతేడాది ఖరీఫ్‌లో 67,33,484 ఎకరాల్లో సాగై, ఈసారి 56,79,969 ఎకరాలకు అంటే దాదాపు 9 లక్షల ఎకరాలకు పైగా తగ్గింది. ధాన్యాల మొత్తం సాగు విస్తీర్ణం 72,48,771 ఎకరాలకు గాను 63,12,526 ఎకరాల్లో (87శాతం) మాత్రమే సాగైంది. నూనెగింజల సాగు 4,47,585 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 3,96,597 ఎకరాలకు పరిమితమైంది.

రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలను సాగు చేయడం తీవ్ర ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి లభ్యతను బట్టి డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా తక్కువ నీటితో పండే జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాలు, శనగ, పెసర వంటి పప్పుధాన్యాలు, ఆముదం, వేరుశనగ వంటి నూనెగింజల ఆరుతడి పంటలను మాత్రమే వేయాలి. మరోవైపు ప్రభుత్వం శాస్త్రీయ అవగాహన లేకుండా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఒక ఆయిల్ పామ్ చెట్టుకు రోజుకు 250 నుంచి 300 లీటర్ల నీరు, ఏటా 1500 నుంచి 1800 మి.మీ వర్షపాతం అవసరం. కరువు సమయంలో కొత్తగా ఆయిల్ పామ్ నాటితే 90శాతానికి పైగా లేత మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి, కేంద్రానికి నివేదికలు పంపి ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలి. ఇతర మౌలిక వసతుల కాంట్రాక్టర్లకు ఇచ్చే నిధులను కరువు పీడిత గ్రామాలకు మళ్లించాలి. రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని వెంటనే అమలులోకి తేవాలి. ఖరీఫ్‌లో సగటు దిగుబడులు పడిపోయిన రైతులందరికీ బీమా పథకం కింద నష్ట పరిహారం అందించాలి. గత ఆరు సీజన్లుగా పంటల బీమా పథకం లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి వీలుగా కౌలు రైతులను కూడా ప్రభుత్వం తక్షణమే గుర్తించాలి. ఈ సీజన్‌లో పంటల సగటు దిగుబడులు బాగా తగ్గిన రైతులతో పాటు కూరగాయల రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. కౌలు రైతులతో సహా, పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి. వరి, పత్తి లాంటి ప్రధాన పంటలకు 2026లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నిర్ణయించిన రుణ పరిమితిలో 50శాతం వరకూ రైతులకు పరిహారంగా అందించాలి. కౌలు రైతుల గుర్తింపు కోసం 2011 అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలి. వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా రైతులను గుర్తించడానికి మహారాష్ట్ర తరహాలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. యాసంగికి ఆరుతడి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడడంతో పాటు పశువుల మేతను సరఫరా చేయాలి. వలసలను నివారించడానికి ఉపాధి హామీ పనులను తక్షణమే విస్తృతంగా ప్రారంభించాలి. ఎక్కువ మందికి పనులు కల్పించడానికి వీలుగా చిన్న, సన్నకారు రైతులకు, గ్రామీణ మౌలిక వసతులైన గిడ్డంగులు, డ్రయ్యింగ్ యార్డులు, స్కూల్ భవనాలు, లాంటి మౌలిక వసతుల మేలు జరిగేలా ఈ సీజన్‌లో ఉన్న ప్రత్యేక పరిస్థితి దృష్ట్యా కొత్త పనులను ఉపాధి హామీ పథకానికి జోడించాలి. రైతుల, స్వయం సహాయక బృందాల బ్యాంకు అప్పుల వాయిదాలను ప్రభుత్వం ఒక ఏడాది పాటు వాయిదా వేసి, వడ్డీలను మాఫీ చేయాలి. ఇప్పటికీ మిషన్ భగీరథ పథకం గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. చాలా చోట్ల ఈ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథ పూర్తి స్థాయి మంచి నీటి పథకం. ఈ పథకం అమలులోని సమస్యలను పరిష్కరించడానికి, తగిన స్థాయిలో తాగునీటిని ప్రజలకు సరఫరా చేయడానికి ప్రభుత్వం పూనుకోకపోవడం వల్ల, ప్రజలు ఎంతో డబ్బు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆయా కుటుంబాలపై పెద్ద ఆర్థిక భారాన్ని మోపుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా, ప్రాజెక్టులలో నీటి కొరత ఉన్నందున మిషన్ భగీరథ నీటిని ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లు వంటి పరిశ్రమలకు మళ్లించకుండా, కేవలం ప్రజల తాగునీటికి, ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించాలి

# కక్షసాధింపులో 'బతుకమ్మ' బలి!

తెలంగాణ ఉద్యమంలో అస్తిత్వ పతాకగా నిలిచిన బతుకమ్మపై ఉద్యమ ద్వేషులైన కాంగ్రెస్ పాలకులు వారి సహజ రీతిలోనే వివక్ష చూపిస్తున్నారు. ఈ పండుగకు సిరిసిల్ల నేతన్నలకు కనీసం చీరల ఆర్డర్లు కూడా సరిగా ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలికేకలతో అల్లాడుతున్నాయి. కనిపించిన దేవుళ్ల పేర్లన్నీ వాడుకొని రాజకీయం చేసే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ఆడబిడ్డల ఘనమైన పండుగ బతుకమ్మకు సరైన ఏర్పాట్లు చేయడం చేతకావడం లేదా? లేదంటే, బతుకమ్మ ఆటపాటల్లో కూడా వినాయకచవితి పండుగలాగే ఊరూరా కేసీఆర్ గానమే వినిపిస్తుందనే భయమా? అని ప్రజల్లో చర్చ జరుగుతున్నది. స్వరాష్ట్ర కల సాకారమైన ఆత్మగౌరవ ప్రతీక. పరాయి పాలకుల గడ్డపై, ఆంధ్రా వలస పాలనలో అణచివేతకు గురైనా మన అస్తిత్వాన్ని చాటుకోవడానికి, ఉద్యమకాలంలో ఇదే బతుకమ్మ తెలంగాణ అస్తిత్వ పతాకమై నిలిచింది. ఆనాడు ఉద్యమంలో వీధివీధినా పూల సింగిడిలై కదిలిన ఆడబిడ్డలు, స్వయంపాలన కాంక్షను ఈ పండుగ ద్వారానే చాటారు. కేసీఆర్ నాయకత్వంలోని గులాబీ సైన్యం ఈ పండుగకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముందుండి నిలిచింది. తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ విశిష్టతను గల్లీ నుంచి ఢిల్లీ దాటించి లండన్, అమెరికా మీదుగా దుబాయ్ బుర్జ్ ఖలీఫా స్క్రీన్ల వరకు చేర్చి, అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మకు ఒక సగర్వమైన గుర్తింపును తెచ్చింది బీఆర్ఎస్ శ్రేణులే. స్వరాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగి, కాంగ్రెస్ పాలకులు గద్దెనెక్కిన తర్వాత నుంచి కనిపిస్తున్న దృశ్యాలు ప్రతీ తెలంగాణవాసి గుండెను రగిలిస్తున్నాయి. అధికార పార్టీకి తెలంగాణ సంస్కృతి అన్నా, ఇక్కడి సంప్రదాయాలన్నా ఎంతటి చులకన భావమున్నదో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరి చూస్తే స్పష్టమవుతున్నది. బతుకమ్మ పండుగను తాము ఎంత ఘనంగా నిర్వహించినా, అది తెలంగాణ వాదానికి, బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు లబ్ధి చేకూరుస్తుందనే అక్కసుతో, తీవ్రమైన రాజకీయ ద్వేషంతోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కోటి మందికిపైగా ఆడబిడ్డల ఇంటికి 'బతుకమ్మ కానుక'గా



రేషన్ షాపుల ద్వారా వారం రోజుల ముందే చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి, పూర్తి చేసేవారు. వందలాది రంగులు, అద్భుతమైన డిజైన్లతో ఒక కుటుంబంలో అన్నగా, తమ్ముడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ పంపే ఆ చీరల కోసం మహిళలు ఎంతగానో ఎదురుచూసేవారు. కానీ నేడు, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బతుకమ్మ కానుకలపై కక్షసాధింపు చర్యలు మొదలయ్యాయి. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని బజారుకీడుస్తూ, చీరల పంపిణీని నిలిపివేసి, బతుకమ్మపై తమకున్న వివక్షను బట్టబయలు చేసుకున్నారు. నాడు బతుకమ్మ చీరల ఆర్డర్ల వల్ల సిరిసిల్ల పవర్‌లూమ్ రంగానికి, పోచంపల్లి చేనేత కార్మికులకు రూ.350 కోట్లకు పైగా బడ్జెట్‌తో నిరంతరాయంగా ఉపాధి లభించేది. ఆ మగ్గాల చప్పుడు నేతన్నల ఇండ్లల్లో సంక్రాంతి సంబురాన్ని నింపేది. కానీ నేడు కాంగ్రెస్ సర్కార్ నేతన్నలకు పాత బకాయిలు చెల్లించకుండా, కొత్త ఆర్డర్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నది. సిరిసిల్ల నేతన్నలను బతుకమ్మ చీరల నెపంతో రోడ్డున పడేసి, సూరత్ కంపెనీలకు మేలు చేసేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం వెనుక ఉన్న కుట్రలేమిటో ప్రజలంతా గమనిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. కానీ నేడు ఆ చెరువుల్లో కనీసం గుర్రపుడెక్కను తీయడానికి, వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా స్థానిక సంస్థల వద్ద నిధులు లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అనవసరమైన పనులకు వేల కోట్లాది రూపాయలను కేటాయిస్తున్న కాంగ్రెస్ సర్కార్, బతుకమ్మ పండుగ నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయకుండా చేతులెత్తేసి, తెలంగాణ పరువు తీసింది. ఢిల్లీ పాలకుల కనుసన్నల్లో నడిచే కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ మట్టి వాసన, ఇక్కడి అస్తిత్వ పండుగల విలువ తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ, కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షను తెలంగాణ పౌరుల ఆత్మగౌరవమైన బతుకమ్మ పండుగపై చూపించడం అత్యంత దుర్మా ర్గం. ఈ వివక్షను తెలంగాణ సమాజం అంతా గమనిస్తున్నది. మన సంస్కృతిని గౌరవించని రాష్ట్ర పాలకులకు, మన పండుగలను అవమానించే ఈ శక్తులకు ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఆడబిడ్డ, ప్రతి నేతన్న రాబోయే రోజుల్లో తమ ఓ టుహక్కు రూపంలో బుద్ధి చెప్పడం ఖాయం.



# అమెరికాలో హిస్టారికల్ వరల్డ్ ప్రీమియర్

దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ వెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఏంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

# రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా



నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం" అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డ్స్‌తోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

# హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'



'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనెక్టవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం. ఇందులో 150మంది ప్రొఫెషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకునిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్" అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సందీప్ కాకరాల, యాక్టర్ ఈజీ, అనిరుధ్, కార్తికేయ, తారక్ పొన్నప్ప కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందికి పైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ పాత్ర విభిన్న కోణాల్లో కనిపించింది. వాస్తవంగా జరిగిన భయానక సంఘటనల స్ఫూర్తితో రూపొందిన తొలి ఇండియన్ స్లాషర్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.

# షూటింగ్ పూర్తి



మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'సంబరాల ఏటి గట్టు' రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన 'బిహైండ్ ది సీన్స్' వీడియోలో ఈ సినిమా కోసం వేసిన భారీ సెట్స్‌ని, కొన్ని రా యాక్షన్ సన్నివేశాలతోపాటు టీమ్ మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ని కూడా చూపించారు. పదికి పైగా భారీ షెడ్యూల్స్‌తో 160 రోజులకు పైగా షూటింగ్ జరిపామని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా 'సంబరాల ఏటిగట్టు' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన సందర్భంగా యూనిట్ మొత్తానికీ కృతజ్ఞతలు తెలుపుతూ, టీమ్‌తో కలిసి హీరో సాయిదుర్గతేజ్ సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు ధనంజయ, ఐశ్వర్యలక్ష్మి, జగపతిబాబు, నరేష్ వీకే, సాయికుమార్, శ్రీకాంత్ మేక, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.



# ఈనెల 30న జ్యోతి పూర్వాజ్ "కిల్లర్" రిలీజ్

జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రలు చేసిన సై ఫై థ్రిల్లర్ సినిమా "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఏ నిర్మిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహించాడు. ఈ నెల 30న థియేటర్లలో మూవీ రిలీజ్ కానుంది. ఈ నెల 21న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓవర్సీస్‌లోనూ "కిల్లర్" మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ "కిల్లర్" సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా వంటి దేశాల్లో విడుదల చేయనుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com